విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :133 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 1 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు

- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- మద్దతు ధర పెంచాక రూ.2,610కు చేరిన క్వింటా గోధుమలు
- ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు
- ఢిల్లీ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాయం తీసుకుంటామన్న అశ్వినీ వైష్ణవ్



## రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!

- భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక
- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి






## ప్రపంచ శాంతిపైనా ఫోకస్!

- ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ
- వాణిజ్యం నుంచి రక్షణ వరకు కీలక అంశాలపై చర్చ
- ఫోన్‌లో మాట్లాడుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై సమీక్ష
- అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి భద్రతలపైనా చర్చలు!



# యువత మార్పు కోరుకుంటోంది

- యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం
- క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

అమరావతి

యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్--2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా- మిగతా3లో

## పేదలందరూ ఆనందంగా ఉంటే అదే

# నిజమైన అభివృద్ధి




- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనకు తొలి మెట్టు
- అలాంటి అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ప్రతి పేదవారికీ గృహకల్పనతో శాశ్వత భద్రత కల్పించడాన్ని బాధ్యతగా తీసుకున్నాం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నాం
- "ఇంటిపట్టా అనేది పేద ప్రజల దశాబ్దాల కల

అమరావతి

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి, నిరంతరం జరగాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని పంటలకు నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఏర్పాటు చేసిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు చంద్రబాబు వేదికపై ఏర్పాటు చేసిన స్టేజ్‌పై నడిచి ప్రజలకు అభివాదం చేశారు. స్టేజ్‌పై సీఎం వెంట మంత్రులు సత్యకుమార్, మనోహర్ ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో - మిగతా3లో



## ఎన్నికల సంఘం పనితీరుకు నిరసనగా

# 2న 'జైల్ భరో'

- అభిజిత్ దిప్కే పిలుపు
- జైల్ భరో ఆందోళన్ నిరసన కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని దీప్కే విజ్ఞప్తి
- అక్టోబర్ 4న ఠాక్రే సోదరుల భారీ మార్చ్

## సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఏపీని ఆదర్శంగా నిలపడమే

# ప్రభుత్వ లక్ష్యం

- పేదలకు గరిష్ఠ ప్రయోజనం.. పాలనపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- సంక్షేమ పథకాల కన్వర్జెన్స్‌తో పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చాలని సీఎం ఆదేశం
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు ఐఐఎం, ఐఐటీల్లో శిక్షణ ఇచ్చే అంశంపై పరిశీలన
- పీ4 కార్యక్రమం పర్యవేక్షణకు సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థ ఏర్పాటు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచన



అమరావతి

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమన్వయం చేయడం ద్వారా పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలనలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఐఐఎం, ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం 'పేదల సేవలో – సంక్షేమ కార్యక్రమాల కన్వర్జెన్స్' అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన - మిగతా3లో




## ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం

- దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
- అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర
- సీఈసీ రాజీనామా చేయాలని నేతల డిమాండ్
- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి

## ఏపీలో సర్ గడువు

# పొడిగింపు

- అధికారులకు కీలక ఆదేశాలు
- అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం
- కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. - మిగతా3లో

# పేదలందరూ ఆనందంగా ఉంటే అదే నిజమైన అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నామని చెప్పారు. ఇవాళ 26,401 మందికి పట్టాలు ఇస్తున్నట్లు వివరించారు. ఇటీవల విశాఖలో, మంగళగిరిలో ఇళ్లపట్టాలు ఇచ్చామని అన్నారు. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చామని, దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లని వెల్లడించారు. తద్వారా ఒక్కొక్కరికీ సగటున రూ.50 లక్షల నుంచి రూ.కోటి లబ్ధి చేకూర్చామని వివరించారు.




"ఇంటిపట్టా అనేది పేద ప్రజల దశాబ్దాల కల. ఇంటిపట్టాల కోసం కొందరు 40, 50 ఏళ్లపాటు ఎదురుచూశారు. గతంలో ఎందరో ప్రయత్నాలు చేసినా పట్టాలు మాత్రం ఇవ్వలేదు. 707 ఎకరాల్లో ఉన్న స్థలాలకు ఇంటి పట్టాలిస్తున్నాం. వారసత్వంగా వస్తున్న మీ ఇంటిని అమ్ముకోవద్దు. సొంతింట్లో, భద్రంగా ఉండాలనేది ప్రతి పేదవాడి చిరకాల కోరిక. ఇంటిపట్టాల విషయంలో 120 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపాం. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదవాళ్లు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి.అభ్యంతరం లేని ప్రతిచోటా పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తున్నాం. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనకు తొలి మెట్టు. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాం. గత ప్రభుత్వ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. "

'కొందరు నేతలు మీ భవిష్యత్?తో ఆటలు ఆడుకున్నారు. గత సర్కార్ భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, మీ పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పట్టాలు ఇస్తున్నాం. గొడ్డలి పార్టీ ఇంటిపట్టాలు ఇవ్వవద్దని అంటోంది. నేను ఏ పార్టీకీ భయపడను. ఇంటిపట్టాలు ఇస్తూనే ఉంటాం. వైఎస్సార్సీపీ పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలని' చంద్రబాబు పేర్కొన్నారు.

పట్టిసీమ కట్టకుండా వైఎస్సార్సీపీ నేతలు అడ్డుపడ్డారని చంద్రబాబు విమర్శించారు. ఎవరు అడ్డుపడినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా పట్టిసీమ పూర్తి చేశామన్నారు. పట్టిసీమతో 50 టీఎంసీల నీరు కృష్ణా డెల్టా, విజయవాడకు ఇచ్చామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా 75 టీఎంసీల నీరు సముద్రంలోకి పోతున్నాయని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం కుడికాలువ ద్వారా త్వరలోనే నీళ్లు ఇస్తామని అన్నారు. మనం బాగుండాలి, పొరుగువాళ్లు కూడా బాగుండాలని కోరుకుంటామని చెప్పారు. గోదావరి-కావేరి అనుసంధానం జరిగితే దక్షిణాదిలో నీటికి కొరతే ఉండదని చంద్రబాబు వెల్లడించారు.

'వైకుంఠపురం, చోడవరం బ్యారేజ్‌లు వస్తాయి. ఈ బ్యారేజ్‌లు పూర్తయితే విజయవాడకు తాగునీటి ఇబ్బందే ఉండదు. రైల్వే బ్రిడ్జి, ప్రకాశం బ్యారేజ్ మధ్య మరో వంతెన వస్తుంది. ఒక్క కియా ప్రాజెక్టు అనంతపురం జిల్లాలో అనేక మార్పులు తెచ్చింది. వెలిగొండ ప్రాజెక్టు మార్కాపురం జిల్లాలో మార్పులు తెస్తోంది. అల్లూరి ఎయిర్‌పోర్ట్ విజయనగరం జిల్లా అభివృద్ధికి తోడ్పడుతోంది. అనేక కష్టాలు అధిగమించి వికాసం వైపు అడుగులు వేస్తున్నాం. వచ్చే పాతికేళ్లలో మనం వేసే ప్రతి అడుగూ చాలా కీలకం. స్వర్ణాంధ్ర సాధనలో మాకు ప్రజల మద్దతు కావాలి. ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు కష్టపడతాం. మా ప్రభుత్వ కార్యక్రమాలు చూడాలని, అండగా నిలవాలని' చంద్రబాబు కోరారు.

"ప్రతి లబ్ధిదారుడికీ ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్నాం. స్త్రీశక్తి కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మా మహిళల కోసం భవిష్యత్?లో ఏసీ బస్సులే కొంటాం. గత సర్కార్ కరెంట్ ఛార్జీలు పెంచి, పేదలపై భారం వేసింది. మేం వచ్చాక మూడేళ్లుగా కరెంట్ ఛార్జీలు పెంచలేదు. అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే పేదవాడికి భోజనం పెడుతున్నాం. పేదవాడు ఆకలితో ఉండకూడదనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రజల ఖర్చులు తగ్గాలి, ఆదాయం పెరగాలి. పీ-4 విధానం తెచ్చాం, పేదలను దత్తత తీసుకునేలా చేశాం."

అమరావతికి ఘనమైన చరిత్ర ఉందని చంద్రబాబు వివరించారు. ఇందుకోసం రైతులు భూములు త్యాగం చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఎన్నో రకాలుగా అమరావతిని అడ్డుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అమరావతి అన్నారు, విశాఖ అన్నారు, ఇప్పుడు మావిగన్ అంటున్నారని' మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసిన రాజధాని అభివృద్ధిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నాబత్తునికి బిగిస్తున్న ఉచ్చు

**గుంటూరు :** మాయ.. మంత్రం.. తంత్రం.. ఈ మూడు పదాలను ఆయన పాటించారు. బ్రహ్మాండంగా కోట్లు కొట్టేశారు. లేనిది ఉన్నట్టుగా భ్రమ కల్పించారు. మొత్తానికి మాయ చేసారు. కాకపోతే రోజులన్నీ ఒకే విధంగా ఉండవు కదా. అధికారంలో ఉన్నారు కాబట్టి అప్పట్లో ఎలా చేసినా చెల్లుబాటయింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అలాంటి అవకాశం కూడా లేదు. మొత్తంగా చూస్తే చేసిన మోసం.. సాగించిన వ్యవహారం అన్ని కళ్ళ ముందు కనిపిస్తున్నాయి.వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ కు సంబంధించిన వ్యవహారంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆయన మెడకు ఉచ్చు గట్టిగానే బిగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే భూమికి సంబంధించిన వ్యవహారంలో పత్రాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆయన రుణం తీసుకున్నట్టుగా చెబుతున్న ఏపీజే ఇంపెక్స్ అనే కంపెనీకి సంబంధించిన వ్యవహారాల విషయంలో కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు సమాచారం.విజయవాడ నగరంలో ఐకెఎఫ్ అనే ఫైనాన్స్ సంస్థ ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో తెనాలి ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన చిరునామాలను పరిశీలించగా అక్కడ కంపెనీ కార్యాలయం బోర్డు.. ఇతర కార్యకలాపాలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదని విషయాన్ని పోలీసులు గుర్తించిన సమాచారం. పోలీసుల దర్యాప్తులో భాగంగా ఏపీజే ఇంపెక్స్ పేరుతో సుమారు మూడు కోట్ల రుణాన్ని శివకుమార్ 2019లో తీసుకున్నారు. రుణం పొందిన తర్వాత బ్యాంకు ఖాతాలలో జరిగిన లావాదేవీలు.. ఇతర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లోన్ తీసుకున్న తర్వాత కంపెనీ పేరుతో శివకుమార్ వ్యాపార కార్యకలాపాలు సాగించలేదా.. కేవలం డబ్బు పొందడానికి మాత్రమే కంపెనీ పేరును ఉపయోగించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.. అయితే ఈ అంశాలకు సంబంధించి తృది నిర్ధారణ ఇంకా రావాల్సి ఉంది. అయితే ఈ కంపెనీ



ద్వారా ఎటువంటి కార్యకలాపాలు సాగించారు.. రుణం ఎలా తీసుకున్నారు.. దానికి ఎటువంటి పత్రాలు సమర్పించారు.. అనే విషయాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెలుగులోకి వచ్చే అవకాశం ఉందిఈ కేసులో కంపెనీ నిర్వహణ.. లోన్ తీసుకోవడానికి సమర్పించిన పత్రాల వంటి వాటి మీద పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గతంలో భూమికి సంబంధించిన సర్వే వివరాలు.. ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్లు.. వంటి పత్రాల మీద అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటిని ఎవరు జారీ చేశారు.. ఎటువంటి ఆధారాలతో వాటిని ధ్రువీకరించారు.. సంబంధిత అధికారులు వాటి మీద సంతకాలు ఎలా పెట్టారు.. వంటి అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తెనాలి పురపాలకం.. కొత్తపేట సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు.ప్రధానంగా ఏపీజే ఇంపెక్స్ కంపెనీ మీదనే ఇక్కడ ప్రశ్నలు వినిపిస్తున్నా. రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో పేర్కొన్న కంపెనీ చిరునామా.. కార్యాలయం చేస్తున్న కార్యకాలపాలు.. బ్యాంకు ద్వారా సాగించిన లావాదేవీలు.. ఆడిట్ వ్యవహారాలు.. లోన్ తీసుకున్నప్పుడు సమర్పించిన ఆస్తి పత్రాలు.. ఇలా అన్ని అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.. ఒకవేళ పత్రాలలో పొందుపరచిన చిరునామాలలో కంపెనీ గనుక కార్యకలాపాలు సాగించలేదని తీరితే ఈ అంశం అత్యంత కీలకంగా మారుతుంది.కంపెనీ.. రుణం మంజూరు వంటి వాటికి పత్రాలు జారీ చేసిన నేపథ్యంలో వాటికి ప్రభుత్వ ధృవీకరణలు ఉన్నాయా.. ఎటువంటి వాటిని అమలు చేశారు.. వాటి వెనుక ఉన్న రికార్డులు ఏమిటి.. అనే అంశాల మీద పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.. ఒకవేళ ఆ పత్రాలు నకిలీవి అయితే.. అప్పుడు ఏం చర్యలు తీసుకోవాలో కూడా పోలీసులు ఆలోచిస్తున్నారు..

# లోకల్ బాడీ ఎన్నికలు యధాతధం

**విజయవాడ :** స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం ఒక క్లారిటీ ఇచ్చింది. ఎన్నికలు ఇంకో రెండు నెలలు ఆలస్యం అవుతాయనే వార్తలను ఖండించింది. పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారమైన మీడియా సమావేశం ద్వారా వెల్లడిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని నమ్మే ముందు.. సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలతో ధ్రువీకరించుకోవాలని సూచించింది. అలాగే స్థానిక ఎన్నికలపై పుకార్లు సృష్టించినా, ఫార్వార్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఏపీ స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మరో రెండు నెలలు ఆలస్యం అవుతుందనే వార్తలను ఖండించింది. ఈ పుకార్లలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల ఆలస్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇందులో ఏ మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. ఈ ఫేక్ వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని తెలిపింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల కోర్టు కేసులపై క్లారిటీ వచ్చాకే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారంలో నిజం లేదని ఏపీ ఎస్ఈసీ




వెల్లడించింది. స్థానిక ఎన్నికలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి కల్పిత సమాచారాన్ని ఇతరులకు పంపించ వద్దని ఎన్నికల సంఘం కోరింది.ఏపీ స్థానిక ఎన్నికల సమాచారాన్ని మీడియా సమావేశాల ద్వారా వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. ఎన్నికల కమిషన్ పేరుతో కల్పిత, తప్పుదారి పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని పుట్టించినా, ఫార్వార్డ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసెజ్‌లను నమ్మే ముందు ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక ప్రకటనల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది.ఏపీలో మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది. అయితే ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడ లేదు. కానీ ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో ఈ ఎన్నికల హడావిడి కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సన్నాహాలు చేసుకుంటున్నాయి. కాగా గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపొందింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం సాధించింది. మరి 2026 స్థానిక ఎన్నికల్లో ఎవరిదీ పై చేయిగా ఉండబోతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

## సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఏపీని ఆదర్శంగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

జూమ్ వేదికగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి పేద కుటుంబానికి సగటున 4 నుంచి 5 పథకాలు అందుతున్నాయని, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం వంటి పథకాలన్నింటినీ సమన్వయం చేసి లబ్ధిదారులకు మరింత అండగా నిలవాలని సూచించారు. పేదరికం, ఆర్థిక అసమానతలు లేని నియోజకవర్గాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. పీ4 (ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యం) మోడల్ అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు పీ4 కార్యక్రమం కింద చేయూతనిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాలనలో సాంకేతికతను జోడించడం ద్వారా పౌర సేవలను మరింత సులభతరం చేయవచ్చని సీఎం పేర్కొన్నారు. సేవలను సమర్థంగా అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఉద్యోగికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, తమ ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్‌కే అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం 'స్వయం బ్రాండ్'ను ప్రోత్సహిస్తున్నామని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. పల్లె పండుగ-3.0 ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కల్పించబడతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత తప్పనిసరి అని ఆదేశించారు. ఏటా అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు' ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణ భారం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతు బజార్లలో తక్కువ ధరకు ఉల్లిని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే తమ అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

## యువత మార్పు కోరుకుంటోంది

-మొదటిపేజీ తరువాయి

మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది**

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

**డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

**అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్**

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు '3ఎస్' మంత్రం**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

## ఏపీలో సర్ గడువు పొడిగింపు..

-మొదటిపేజీ తరువాయి

పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

## 10 నెలల ముందే వీఆర్ఎస్

**తిరుపతి :** ఏపీఎస్ఆర్టీసీలో ప్రభుత్వ అధికారి వీఆర్ఎస్ (స్వచ్ఛంద పదవీ విరమణ) కోసం దరఖాస్తు చేయం ఆసక్తికరంగా మారింది. ఏపీఎస్ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఆపరేషన్స్ విభాగం ఈడీ రాఘవకుమార్ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన మరో 10 నెలల పాటూ సర్వీస్ ఉంది.. కానీ వారం క్రితం ఆయన ఉన్నట్టుండి వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేశారు. గతంల ఆయన సుధీర్ఘంగా స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించారు. కొన్ని నెలల క్రితం రాఘవకుమార్‌కు ప్రమోషన్ దక్కింది.. కడప జోన్ ఆర్టీసీ ఈడీగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఇంతలో ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఆపరేషన్స్ విభాగంగా ఈడీగా ఉన్న అధికారి పదవీ విమరణ చేయడంతో.. ఆయన స్థానంలో రాఘవకుమార్ కడప నుంచి బదిలీపై ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి రెండు నెలలుగా పనిచేస్తున్నారురాఘవకుమార్ వీఆర్ఎస్ తీసుకోవడానికి కారణం ఏంటనే చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా క్రితం ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన వ్యక్తి ఇంతలోనే వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడం హాట్‌టాపిక్ అవుతోంది. రాఘవకుమార్ మాత్రం వ్యక్తిగత కారణాలతోనే తాను వీఆర్ఎస్ తీసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆర్టీసీ ఇంఛార్జ్ ఎండీ ఉన్న రవాణాశాఖ కార్యదర్శి కోన శశిధర్, జాయింట్ ఎండీ శివప్రసాద్ కొత్తగా రాబోతున్న విద్యుత్ బస్సుల అంశంపై ఫోకస్ పెట్టారు. ఈ కొత్త విద్యుత్ బస్సులను ఏయే డిపోలకు కేటాయించాలి.. ఏ రూట్లలో నడపాలనే సమాచారాన్ని ఆపరేషన్స్ విభాగం అందజేయాల్సి ఉంటుంది. ఈ ఆపరేషన్స్ విభాగానికి రాఘవకుమార్ ఈడీగా ఉన్నారు. అయితే ఆయనకు పూర్తి సమాచారం రాలేదని కూడా తెలుస్తోంది. మొత్తం మీద ఆర్టీసీ ఈడీ రాఘవకుమార్ వీఆర్ఎస్ ఎపిసోడ్ ఆసక్తికంగా మారింది.ఏపీలో ఇటీవల తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మొత్తం 2,405 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. వీటిలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే 412 కి.మీ. మేర ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. 36 చోట్ల రోడ్లు కోతకు గురికాగా, 9 చోట్ల గండ్లు పడ్డాయన్నారు. ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేశామన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నిర్వహణ



- ఎస్ఎంసి ఎన్నికల పురోగతి పై విద్యాశాఖాధికారులతో సమగ్ర సమీక్ష.
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికల నిర్వహణలో ఎదురైన సమస్యలు, ఘర్షణలు, వాయిదా పడిన ఎన్నికల ప్రక్రియ పై విద్యాశాఖాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారయ్యపేట పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికల సందర్భంగా రెండు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగిందని, గుంపుగా వచ్చి ఎన్నికల నిర్వహణను అడ్డుకోవడంతో ఎన్నికలు నిలిచిపోయాయని విద్యాశాఖాధికారులు కలెక్టర్ కు తెలుపగా, ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన గొలుగొండ ప్రాంతం మొదలైన చోట్ల, బాధ్యుల పై పోలీస్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. చిన్నప్పన్నపాలెం, అయ్యన్నపాలెం పాఠశాలల్లో కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తయినప్పటికీ, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల ఎన్నికలో ఓట్లు సమంగా రావడంతో (టై) వివాదం తలెత్తి ఎన్నికల ప్రక్రియ ఆగిపోయిందని, మరికొన్ని పాఠశాలల్లో గ్రామస్తులు, తల్లిదండ్రుల మధ్య వర్గపోరు, ఓటర్ల అర్హత పై వివాదాలు, తగినంత కోరం లేకపోవడం వలన ఎన్నికలను వాయిదా వేయాల్సి వచ్చిందని కలెక్టర్ కు తెలిపారు.

అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఘటనల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు నిలిచిపోయిన అన్ని పాఠశాలలకు సంబంధించి సమగ్ర నివేదిక సమర్పించాలని, సమన్వయంతో శాంతియుత వాతావరణంలో ఎస్ఎంసి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. తగినంత కోరం లేకపోవడం వల్ల ఏటికొప్పాక పాఠశాలలో ఎన్నిక ప్రక్రియ రద్దయిందని, జాకారపేట పాఠశాలలో ఎస్ఎంసి సభ్యుల ఎంపిక పూర్తయినప్పటికీ, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎంపిక విషయంలో అవగాహన లోపం వల్ల మొదట ఎన్నిక వాయిదా పడిందని, అయితే అధికారులు మరుసటి రోజు ఉదయం క్షేత్రస్థాయికి వెళ్లి వివాదాన్ని పరిష్కరించి, ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన వివరాలను అప్‌డేట్ చెయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనకాపల్లి పరిధిలోని మొత్తం 79 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయి.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావుతో పాటు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** జల జీవన్ మిషన్ (జేజేఎం) కింద మంజూరైన తాగునీటి పథకాల పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేసి, నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరములో జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనుల పురోగతి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఉన్న బిల్లుల చెల్లింపుల ప్రక్రియలు పూర్తయినందున, ఇక పై పనుల్లో అలస్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. నిలిచిపోయిన పనులన్నింటినీ వెంటనే పునఃప్రారంభించాలని, ప్రారంభించిన ప్రతీ పనిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ, పనుల నాణ్యత మరియు వేగాన్ని పరిశీలించాలని, తాగునీటి కొరత, ప్రజల నిరసనలు లేదా నిర్లక్ష్యంతో కూడిన సమస్యలు తలెత్తకుండా అధికారులు పూర్తి స్థాయిలో శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో జల జీవన్ మిషన్ కింద రూ. 675.95 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 886 పనులు మంజూరయ్యాయని, నిధుల సమకూర్పు మూలాలతో సంబంధం లేకుండా, చేపట్టిన ప్రతి ప్రాజెక్టును త్వరితగతిన ముగింపునకు తీసుకురావడమే అధికారుల ప్రాథమిక బాధ్యతని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్‌తో పాటు తదుపరి ప్రాధాన్యతాంశంగా ఇంటింటి మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఇ, డి ఈ లు, జేఈలు, ఇ. ఇ లు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జారీః జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, అనకాపల్లి

# ధర్మవరంలో ఘనంగా స్వర్ణ నంది అవార్డు గ్రహీత వైష్ణవ శ్రీనివాసులకు ఘన సన్మానం



- మెగా ఫౌండేషన్, గొడుగు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం
- పాత్రికేయ రంగంలో సేవలకు స్వర్ణ నంది అవార్డు అందుకోవడం అభినందనీయం: గగ్గోలు హరీష్ కుమార్
- ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకం: హరీష్ కుమార్
- వైష్ణవ శ్రీనివాసులు మరిన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోవాలని ఆకాంక్ష

**ధర్మవరం, సెప్టెంబర్ 30 (పెన్ సత్తా)** పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలందించిన ధర్మవరానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు వైష్ణవ శ్రీనివాసులు ప్రతిష్ఠాత్మక స్వర్ణ నంది అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. మెగా ఫౌండేషన్, గొడుగు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవో మీటింగ్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం కార్యాలయ ఇంచార్జ్ గగ్గోలు హరీష్ కుమార్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత, న్యాయవాది సుమలత, బాలసుందరి, ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, ప్రణవ్ సాయి స్కూల్ కరస్పాండెంట్ కృష్ణకిశోర్, అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, పాత్రికేయ రంగంలో అందిస్తున్న సేవలను గుర్తించి వైష్ణవ శ్రీనివాసులు స్వర్ణ నంది అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజానికి ఉపయోగపడే అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పాత్రికేయులు మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు, సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. వైష్ణవ శ్రీనివాసులు భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం పాత్రికేయులు గోవర్ధన్ రెడ్డి, నరసింహులు, దొడ్డప్ప, రమణ, జయశంకర్, నాగరాజు, బండి సంజయ్, వెంకట్, శివానంద, జయరాం రెడ్డి, చింతా సుబ్బు, మజ్జిగ భాస్కర్, చిరంజీవి, రవి, రాజశేఖర్, రమేష్, గంటపార నాగరాజు, గ్రంధి శ్రీనివాసులు, వి.దొడ్డప్ప, రాము బత్తలపల్లి, రామాంజనేయులు, భాస్కర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, జానపాటి మోహన్, రాము, ఖాదర్ బాషా, అంగన్వాడీ యూనియన్ సభ్యులు సరస్వతి, చంద్రకళ, సీపీఐ నాయకులు మధు, రవి, ఏవోపీ అధ్యక్షుడు బాబు, రామదండు సుకుమార్, అన్న లక్ష్మీనారాయణ, పాల్గొని వైష్ణవ శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం

మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు

**ధర్మవరం, సెప్టెంబర్ 30 (పెన్ సత్తా)** చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, కుటుంబాల ఆరోగ్యం మరియు పోషణ కోసం అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయమని మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు బుధవారం ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ కెవీఎస్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేష్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీష్ బాబు పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు ప్రభుత్వానికి , ప్రజలకు మధ్య కీలకమైన వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్యం, పోషణ, తల్లీబిడ్డల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను చేరువ చేయడంలో వారు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. చిన్నారుల ఎదుగుదల, పోషకాహారం, గర్భిణులు మరియు బాలింతల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషి ఎంతో విలువైనదని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యం, విద్య, సంక్షేమంతో పాటు సమాజంలోని వివిధ వర్గాల సేవలను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం అక్కడికి వచ్చిన బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అంగన్వాడి పోషణ్ సామాగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో సాకే



ఓబిలేసు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జగ్గా నాగరత్నమ్మ, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పోరాళ్ల మహాలక్ష్మి, బిజెపి నాయకులు నాగులయ్య, మారుతీ, కుమారి .. అంగన్వాడీ టీచర్లు రత్నమ్మ, సుభద్ర, లలితమ్మ, అంగన్వాడి ఆయాలు గంగమ్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్ ల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు

పిఎసిఎస్ చైర్ పర్సన్ కె.బుజ్జి



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** పిఎసిఎస్ ల ద్వారా తక్కువ వడ్డీకే వివిధ రకాల రుణాలు అందిస్తున్నామని నక్కపల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. నక్కపల్లి పిఎసిఎస్ లో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రైతులను ఉద్దేశించి కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ, రైతు సోదరులందరికీ సంఘం ద్వారా తక్కువ వడ్డీకే వివిధ రకాల రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు రూ.6 లక్షల నుంచి గరిష్టంగా రూ.25 లక్షల వరకు రూపాయి వడ్డీకే రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే నూతన భవనాల నిర్మాణానికి రూ.40 లక్షల వరకు, ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలకు రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రుణాలను సులభమైన వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించే అవకాశం ఉందని వివరించారు. అదేవిధంగా స్వయం కృషి పథకం ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారికి రూ.1 లక్ష వరకు రుణాలను అడ్డరోడ్డు డిసిసిబి బ్రాంచ్ ద్వారా అతి తక్కువ సమయంలో మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకోకుండా, డీసీసీబీ, పిఎసిఎస్ ల ద్వారా అందించే తక్కువ వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలు అందిస్తున్న రుణ సదుపాయాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు కోసూరి శ్రీను, మన బాల కొండబాబు, అడ్డరోడ్డు డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ ఝాన్సీ లక్ష్మి, సంఘ సీఈవో ఖాదర్ ఖాన్, సిబ్బంది గోవిందు, నాగేష్, వరలక్ష్మి, ధనలక్ష్మి రైతులు గట్టెం గణేష్, మనబాల గంగరాజు, కొప్పిశెట్టి శ్రీను, కొంకిపూడి దొరబాబు, కొప్పిశెట్టి వాసు, తోట అప్పారావు, అడ్డరి భూషణం, వెదుళ్ల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

# పోషకాహారంపై దృష్టి చారించాలి

ఉమాకలో పోషకాహార మాసోత్సవాలు





**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని నక్కపల్లి పిఎసిఎస్ చైర్పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. బుధవారం ఉపమాక అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి సమతుల్యమైన పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లితో పాటు కడుపులో పెరుగుతున్న శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి దోహదపడుతుందని చెప్పారు. బాలింతలు ప్రసవానంతరం తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శరీరానికి అవసరమైన పోషకాలు అందే విధంగా ఆహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలకు పాలు, గుడ్లు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది కలిసి పనిచేయాలని, ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగడం సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడీ సేవలను గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బుజ్జిని అంగన్వాడి కార్యకర్తలు సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, కొప్పిశెట్టి వాసు, కొంకిపూడి దొరబాబు తోట అప్పారావు, డాక్టర్ జయ ప్రకాష్ గారు, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది, ఉప్మాక అంగన్వాడి కార్యకర్తలు మాధవి, పద్మ, రమణికుమారి, లోవలక్ష్మి పలువురు సెక్టార్ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ఉచిత బియ్యం పంపిణీపై గంటా నూకరాజు హర్షం



**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** తీవ్ర వాయుగుండం కారణంగా వారం రోజులపాటు సముద్రంలో వేటకు వెళ్లలేకపోయిన మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బుధవారం భీమిలి టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లకు మత్స్యకారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## సద్భావన సభలో పోలీసుల అవగాహన



**విజయనగరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** నెల్లిమర్ల మండలం జర్జాపేట గ్రామంలో నిర్వహించిన సద్భావన సభకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మహిళలు, బాలల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, మైనర్ల డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని కోరారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామస్తులు ప్రశాంతంగా ఉండి, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్. రాఘువులు, సీఐలు, ఎస్ఐలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆనందపురంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పోలీస్, రెవెన్యూ శాఖల సమీక్ష



**ఆనందపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 30::** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆనందపురం మండలంలో పోలీస్, రెవెన్యూ అధికారుల సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ శంఖబ్రత బాగ్చీ, జోన్-1 డీసీపీ ఆదేశాల మేరకు నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు పర్యవేక్షణలో సమావేశం జరిగింది. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, పోలీస్--రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంపై అధికారులు చర్చించారు. సమావేశంలో సీఐ వీవీసీఎం ఎర్రన్నాయుడు, ఎస్ఐలు హరీష్, శివ, సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాబు, ఉప తహసీల్దార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జీవీఎంసీ 2వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థిత్వం కోరిన చోడిపిల్లి సాయి జయశంకర్



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జీవీఎంసీ 2వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ చోడిపిల్లి సాయి జయశంకర్ భీమిలి శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును కలిశారు. భీమిలిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గంటా శ్రీనివాసరావును కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 2వ వార్డులో పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలతో తనకు ఉన్న సంబంధాలు, స్థానికంగా పార్టీ కార్యకర్తలతో సమన్వయం తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పిస్తే వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని సాయి జయశంకర్ పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.

# భూసేకరణలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి






- భూ నిర్వాసితుల ఆందోళన
- నిర్వాసితులకు అండగా వైసిపి సిపిఎం
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- భారీగా మోహరించిన పోలీసు బలగాలు

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ లో భూములు ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలని నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. నక్కపల్లి మండలం లో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు పెండింగ్ ప్యాకేజీ ఇవ్వాలని, వివాహమైన ఆడపిల్లలకు ప్యాకేజీ చెల్లించాలని,ఆర్ కార్డులు ఇచ్చి ,ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులలో నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతగా పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ పనులు జరుగుతున్న మెయిన్ గేటు దగ్గర లో ఉన్న పాటిమీద కాంద్రకోట నూకాలమ్మ తల్లి గుడి ఆవరణలో ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న నిర్వాసితుల వద్ద భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, నాయకులతో చర్చలు జరిపి నక్కపల్లి తహాశీల్దార్ కార్యాలయం, అడ్డురోడ్డు ఆర్డీవో కార్యాలయం లోఅధికారులతో చర్చలు జరిపేందుకు నిర్వాసితులను ఒప్పించారు. దీంతో అక్కడ ఆందోళన చేస్తున్న వారిని నక్కపల్లి మండల తహాశీల్దార్ కార్యాలయం వద్ద కు తీసుకురావడం జరిగింది. ఈసందర్భంగా నక్కపల్లి తహాశీల్దార్ కార్యాలయం చుట్టూ బారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా అడ్డ రోడ్డు ఆర్డీవో తహాశీల్దార్ కార్యాలయం లో చర్చలకు రమ్మని పిలిచారు. తహాశీల్దార్ కార్యాలయం లో నిర్వాసితులు అందరికీ స్థలం సరిపోదని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చర్చలకు ఏర్పాటు చేయాలని వీసం రామకృష్ణ, సిపిఎం అప్పలరాజు కోరగా దీనికి ఆర్డీవో అంగీకరించలేదు. ఈ దశలో నిర్వాసితులు జాతీయ రహదారి పై రాస్తారోకో చేయడానికి వెళ్తుండగా పోలీసు అడ్డుకున్నారు. ఆందోళనకారులకు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దానికి నిర్వాసితులు నక్కపల్లి తహాశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్డీవో రామలక్ష్మి వచ్చి ఈ సమస్య ను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పదిరోజుల్లో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తో నిర్వాసితులు, ప్రతినిదులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి నిర్వాసితులు సమస్యలు పై చర్చించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసితుల సమస్యలు ఆర్డీవో కి వైయస్ ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు వివరించారు, రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ,తళ్ళ భార్గవ్,సూరకాసుల గోవిందరావు,గంటా తిరుపతిరావు,రావి చిన్ని, గొర్ల గోవిందరావు, రోహిణి రాణి, దుర్గ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి, అడ్డరోడ్ సి ఐ రామకృష్ణ, పాయకరావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, నర్సీపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ నక్కపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సన్నిబాబు పెద్ద ఎత్తున పోలీసు బలగాలు పాల్గొన్నారు.



# గొట్లూరు ఎస్సీ కాలనీ హద్దులపై విచారణ




### భూ రికార్డులు పరిశీలించి హద్దులు నిర్ధారిస్తాం: ఆర్డీఓ, తహసీల్దార్ హామీ

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 30 (పెన్ సత్తా)** ధర్మవరం రూరల్ మండలం గొట్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ స్థలానికి సంబంధించిన వివాదంపై ధర్మవరం ఆర్డీఓ బుధవారం విచారణ చేపట్టారు. భూ రికార్డులను పరిశీలించి,స్థల హద్దులను సర్వే ద్వారా నిర్ధారిస్తామని ఆర్డీఓ,తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గొట్లూరు గ్రామంలో 1983 సంవత్సరం నుంచి సర్వే నంబర్ 488/3లో 0.88 సెంట్లకు సంబంధించిన ఎస్సీ కాలనీ స్థలం ఉన్నట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. ఈ స్థలంలో మాల సామాజిక వర్గానికి చెందిన 21 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అయితే సర్వే నంబర్ 488/2లోని కొందరు వ్యక్తులు ఎస్సీ కాలనీకి సంబంధించిన స్థలంలో ఆక్రమణలకు పాల్పడి నిర్మాణాలు చేపట్టారని వారు ఆరోపించారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని 21 కుటుంబాల సభ్యులు తెలిపారు. దీంతో వారు ధర్మవరం ఆర్డీఓను కలిసి తమ సమస్యను వివరించారు. స్పందించిన ఆర్డీఓ ఇరువర్గాలను బుధవారం విచారణకు పిలిపించారు. విచారణ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు పరిస్థితి రసాభాసగా మారింది. ఎస్సీ కాలనీలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి సంబంధించిన స్థలంపై కూడా ఇరువర్గాల మధ్య అభిప్రాయభేదాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్డీఓ తహసీల్దార్‌ను పిలిపించి భూ రికార్డులను పరిశీలించి సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. 1928 నాటి గ్రామ సరిహద్దులకు సంబంధించిన రికార్డులు,బౌండరీ రాళ్లను పరిశీలించి స్థల హద్దులను నిర్ధారిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, హెచ్ఆర్‌సీసీఐ డివిజనల్ చైర్మన్ కోట్ల వంశీ,హెచ్ఆర్‌సీసీఐ వర్కింగ్ చైర్మన్,ఏపీ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కోట్ల మల్లికార్జున, హెచ్ఆర్‌సీసీఐ రామాంజనేయులు,జై భీమ్‌రావు భారత్ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా మీడియా ఇంచార్జ్ మద్దెల ఈశ్వర్,ఎర్రిస్వామి, నరసింహులు, మారుతి,గంగాధర్, నారాయణస్వామి, మహిళా నాయకురాలు ఆదినారాయణమ్మ, జయమ్మ, పార్వతమ్మ,రాధ తదితరులు పాల్గొన్నారు.

# వసుధ ఫార్మా యూనిట్--3 లో ఉద్యోగి ఆకస్మిక మృతి.

**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** బుధవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటల సమయంలో పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి లోని వసుధ ఫార్మా యూనిట్--3, ప్రొడక్షన్ బ్లాక్ నెం.1లో రమేష్ కలిశెట్టి (36), తండ్రి నరసింహులు, స్వగ్రామం గోలగాం గ్రామం, తాడిపూడి పోస్టు, గుర్ల మండలం, విజయనగరం జిల్లా, ప్రస్తుతం చినగంట్యాడ, గాజువాకలో నివాసం ఉంటూ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న వ్యక్తి బి-షిఫ్ట్ విధులకు హాజరయ్యారు. షిఫ్ట్ విధులు మారుతున్న సమయంలో రమేష్‌కు అకస్మాత్తుగా తల తిరిగి కుప్పకూలిపోవడంతో, ఫ్యాక్టరీ లోని ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అగనంపూడి ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రమేష్ నిన్న వారపు సెలవులో ఉన్నారని, ఈ రోజు మార్నింగ్ షిఫ్ట్‌కు విధులు కేటాయించబడినప్పటికీ, షిఫ్ట్ మార్చుకుని బి-షిఫ్ట్‌కు హాజరైనట్లు తెలిసింది. కుప్పకూలిన అనంతరం తీవ్రంగా చెమటలు పట్టడంతో పాటు వాంతి వచ్చినట్లు ప్రథమ చికిత్స అందించిన వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడు గత ఆరు సంవత్సరాలుగా వసుధ ఫార్మాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.

మృతదేహాన్ని అగనంపూడి ఏరియా ఆసుపత్రి నుండి ఎన్టీఆర్ మార్చురీ అనకాపల్లికి తరలించడం జరిగిందని పోలీసులు తెలియజేసారు.



# ప్రధాని మోదీ ప్రజాసేవకు గుర్తుగా అంగన్వాడీ ఉత్సవాలు

**ఆనందపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 30:** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని పెద్దిపాలెం కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం. పరశురామరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, పాలు, గుడ్లు తదితర పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పోషకాహార లోప నివారణ, తల్లులు--చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ అంగన్వాడీ సేవల ప్రధాన లక్ష్యమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది సేవలను అభినందించారు. కార్యక్రమంలో భీమిలి ఇన్‌చార్జి జీరు కైలాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పొట్నూరు వెంకటకృష్ణారావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాదెండ్ల జ్యోతి, మండల అధ్యక్షులు విజయలక్ష్మి, సురేశ్‌రెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ శాంతిపైనా ఫోకస్!

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రోజు ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్- అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో జరుగుతున్న పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సంభాషణలో ముఖ్యంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధనం, అత్యంత కీలకమైన సాంకేతికతలు తదితర రంగాల్లో పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన సహకారంపై చర్చించారు. ఇదే సమయంలో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచంలో శాంతి భద్రతల్ని పెంపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై మోదీ- ట్రంప్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ట్రంప్‌తో ఫోన్ కాల్ గురించి ప్రధాని మోదీ స్వయంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. “అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలవంతమైన సంభాషణ జరిగింది. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, క్రిటికల్ టెక్నాలజీతో పాటు పరస్పర ప్రయోజనాలు ఉన్న అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించాం. మా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కలిసి పనిచేయాలని నిర్ణయించాం.”

ట్రంప్- మోదీ సంభాషణ గురించి భారత ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం భారత్- అమెరికా సంబంధాల్ని మరింత విస్తృతం చేయడంపైనే ప్రధానంగా చర్చ సాగింది. వాణిజ్య సంబంధాలు, రక్షణ భాగస్వామ్యం, క్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై సహకారాన్ని సమీక్షించినట్లు వెల్లడించింది. భారత్ అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (కాంప్రెహెన్సివ్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్) మరింత బలోపేతం చేసి, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం సంప్రదింపుల్ని




కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని పీఎంఓ తన ప్రకటనలో పేర్కొంది.

### ట్రేడ్ డీల్ కోసం చర్చలు

భారత్- అమెరికా మధ్య ఇప్పటివరకు పూర్తి స్థాయిలో వాణిజ్య ఒప్పందం కుదరలేదు. పరస్పర ప్రయోజనకరంగా ఉండేలా ట్రేడ్ డీల్‌ను ఖరారు చేసేందుకు పలు దఫాలుగా ఉన్నత స్థాయి అధికారుల మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి. భారత్ నుంచి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో ప్రతినిధులు అమెరికాకు వెళ్లడం, అక్కడి నుంచి ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం భారత్‌లో పర్యటించి చర్చలు జరపడం ఇలా ఎన్నో జరిగాయి. మరోవైపు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల అమెరికాలో దీని గురించి మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య దాదాపు అవగాహన ఏర్పడిందని అన్నారు. కొన్ని క్లిష్టమైన నిబంధనలు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం గురించి ప్రధాని మోదీ, అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ మధ్య కూడా చర్చలు సాగుతున్నాయి. కేవలం ద్వైపాక్షిక వేదికల్లోనే కాకుండా బహుపాక్షిక వేదికల్లోనూ ఇరువురు నేతలు భేటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా కూడా ఫ్రాన్స్‌లో మోదీ, ట్రంప్ సమావేశమయ్యారు. కీలకమైన రక్షణ, ఇంధనం, వాణిజ్యం వంటి రంగాల్లో పురోగతిని సమీక్షించారు.

### అంతర్జాతీయ పరిణామాలపైనా చర్చలు

తాజాగా మోదీ- ట్రంప్ ఫోన్ సంభాషణలో కేవలం భారత్- అమెరికా సంబంధాలే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా వివిధ పరిణామాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు, భౌగోళిక- రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. ప్రపంచ శాంతి, భద్రత కోసం ఇరు దేశాలు కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతను పునరుద్ఘాటించారు. కొంత కాలంగా పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా ఇక్కడ అమెరికా- ఇరాన్ దాడులు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మార్చిలోనే ట్రంప్‌తో జరిగిన ఫోన్ కాల్‌లో పశ్చిమాసియా పరిస్థితులపై మోదీ భారత్ వైఖరిని స్పష్టం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించి వీలైనంత త్వరగా శాంతిని పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మరోవైపు ప్రస్తుతం భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌కు కూడా ఇదే చెబుతూ వస్తోంది. ఇదొక్కటే కాదు, రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి కూడా భారత్ ఎప్పటినుంచో శాంతి మంత్రం జపిస్తోంది. ఆగస్టులో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ (ఎస్‌సీఓ) రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ అయ్యారు. అప్పుడే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించాల్సిన సమయం ఆసన్నమైందని, యుద్ధం మానవాళిని వెనక్కి నెడుతోందని వ్యాఖ్యానించారు.

# ఈసీపై ‘ఇండియా’ కూటమి సమరశంఖం..

ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు ‘ఓట్ బందీ’ ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే సర్‌కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.

“అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన




అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవస?థలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్- నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న దిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తాం.”

ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

“ప్రజల ఓట్లను దోచుకుని, మోసం చేస్తే ఇక ఈ దేశం ఎక్కడికి పోతుంది ఇది మా విన్నపం కాదు, మా డిమాండ్. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఆందోళన తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ఓట్లను దోచుకున్నారు కదా? అసలు ఈవీఎం యంత్రాన్ని ఎందుకు ఉపయోగించారు ఆ శివ ఖన్నా ఎవరు అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అతనికి ఆ సాఫ్ట్‌వేర్ ఎక్కడి నుంచి వచ్చింది ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి దాని ద్వారా పూర్తిగా దోచుకున్నారు. వారు ఆ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఈఆర్‌ఓలను పూర్తిగా స్తంభింపజేశారు. మొత్తం వ్యవస్థను ప్రమాదంలో పడేశారు. సీఈసీ ఆ పదవిలో ఒక్క నిమిషం కూడా కొనసాగే అర్హత లేదు. తక్షణమే రాజీనామా చేయాలి. ఆయనతో పాటు ప్రధాని మోదీ కూడా రాజీనామా చేయాలి.”

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా మండిపడ్డారు. దేశంలో జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణను అనుభవిస్తున్న ఏకైక పౌరుడు జ్ఞానేష్ కుమార్ అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

# ఎన్నికల సంఘం పనితీరుకు నిరసనగా 2న ‘జైల్ భరో’

కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, అది తీసుకున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువులను దెబ్బతీసేలా ఈసీ వ్యవహరిస్తోందంటూ విపక్షాలు, మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే కీలక ప్రకటన చేశారు. ఈసీ పనితీరుకు నిరసనగా అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ముంబయిలోని చారిత్రక శివాజీ పార్క్ వేదికగా ‘జైల్ భరో ఆందోళన్’ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ఆందోళనలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం ముంబయిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలను దీప్కే సమర్థించారు. దేశంలో ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని దిప్కే పేర్కొన్నారు. ఈసీ నియంతృత్వ పోకడలు ఆందోళనకరంగా మారాయన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు, ఈసీ పనితీరుపై కొన్ని సంవత్సరాలుగా అనుమానాలు వ్యక్తమవుతున్నా సరైన పరిష్కార మార్గం చూపడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఇప్పటికే సీజేపీ అల్టిమేటం జారీ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, జనవరి 2025 నాటి ఓటర్ల జాబితాను యథావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా, 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లను సాధించేందుకు సీజేపీ



మరో ఉద్యోమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, గాంధీ జయంతి రోజున ఈ నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు ముంబై పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా ‘జైల్ భరో ఆందోళన్’ చేపట్టి తీరుతామని దిప్కే తేల్చిచెప్పారు. పౌరుల గొంతును అణచివేయాలని చూస్తే ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తుందని దీప్కే హెచ్చరించారు.

### బైకుల్లా- బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన

ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 4న ముంబయిలో భారీ కవాతును నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే వెల్లడించారు. బైకుల్లాలోని రిచర్డ్సన్ క్రుడాస్ వద్ద ఉదయం ప్రారంభమై, బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ఈవీఎం, ఎన్నికల కమిషన్ పనితీరుపై తమ పార్టీ చాలా సంవత్సరాలుగా ప్రశ్నలు లేవనెత్తుతోందని, అయితే ఇంతవరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఇరువురు నేతలు ప్రకటించారు. ఈ నిరసన ప్రదర్శనలో ఎలాంటి పార్టీ జెండాలను వాడకుండా త్రివర్ణ పతాకాన్ని మాత్రమే చేతబూని పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం ఏ ఒక్క పార్టీకో పరిమితమైనది కాదని, దేశ ప్రజల హక్కులను కాపాడుకోవడంసానికోసం ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా కదలిరావాలని రాజ్ ఠాక్రే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో అభిజిత్ దిప్కే తలపెట్టిన ‘జైల్ భరో’ ఉద్యమానికి తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి కొద్దిరోజుల క్రితం సీజేపీ కీలక హెచ్చరిక జారీ చేసింది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్? రాజీనామా చేయకుంటే జంతర్? మంతర్? వద్ద మరోసారి నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపింది. త్వరలో జరగనున్న అన్ని అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్? చేసింది. ‘సర్’ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరింది.

## రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు

ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల్లో అన్నదాతలకు అండగా నిలుస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రబీ పంటల కనీస మద్దతు ధరను పెంచుతూ ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. రైతులు పండించిన పంటల ఉత్పత్తి వ్యయంపై కనీసం 50శాతం అదనపు లాభం చేకూరేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. తాజా నిర్ణయంతో 2027-28 సీజన్‌కు క్వింటా గోధుమల ధర 25 రూపాయల మేర పెరిగి 2వేల 610 రూపాయలకు చేరింది. “గోధుమల ఉత్పత్తి వ్యయం క్వింటాలుకు రూ. 1,264గా ఉండగా, 2027-28 సంవత్సరానికి మీఫ్రాని దానికి రెట్టింపు కంటే ఎక్కువగా, అంటే క్వింటాలుకు రూ. 2,610గా నిర్ణయించాం. అలాగే, బార్లీ మీఫ్రాని 2026-27లో ఉన్న క్వింటాలుకు రూ. 2,150 నుంచి, 2027-28 రబీ మార్కెటింగ్ సంవత్సరానికి క్వింటాలుకు రూ. 2,286కి పెంచాం. ఇక, పప్పుధాన్యాల విషయానికొస్తే, శనగల మద్దతు ధర క్వింటాలుకు రూ. 5,875 నుంచి రూ. 83 పెరిగి రూ. 5,958కి చేరింది. అదే సమయంలో మసూర్ పప్పు మీఫ్రా క్వింటాలుకు రూ. 390 పెరిగి రూ. 7,390కి చేరింది.” ఇక, నూనె గింజల విషయానికొస్తే ఆవాల మద్దతు ధర క్వింటాలుకు రూ. 6,200 నుంచి రూ. 413 పెరిగి రూ. 6,613కి చేరిందని అశ్వినీ వైష్ణవ్? పేర్కొన్నారు. అలాగే కుసుమల (ఖుటశ్రీశీషవతీ) ధర గత ఏడాది ఉన్న క్వింటాలుకు రూ. 6,540 నుంచి రూ. 675 పెరిగి రూ. 7,215కి చేరిందన్నారు. 2027-28 మార్కెటింగ్ సంవత్సరంలో 324 లక్షల టన్నుల ధాన్యానికి సంబంధించి రైతులకు చెల్లించే మొత్తం విలువ రూ. 90,962 కోట్లుగా ఉంటుందని ఆయన అంచనా వేశారు. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సిఫార్సుల ఆధారంగా, ఉత్పత్తి వ్యయం, ‘ఎల్ నినో’ ప్రభావంపై ఆందోళనలు, అలాగే అంతర్జాతీయ, దేశీయ ధరల పోకడలను పరిగణనలోకి తీసుకుని ఆరు రకాల రబీ పంటలకు కనీస మద్దతు ధర (మీఫ్రా)ను వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. 2026-27 పంట సంవత్సరానికి (జులై-జూన్) గోధుమల ఉత్పత్తి లక్ష్యాన్ని వ్యవసాయ శాఖ 121 మిలియన్ టన్నులుగా నిర్దేశించింది. గోధుమ అనేది ప్రధాన రబీ (శీతాకాలపు) పంట. సాధారణంగా అక్టోబర్‌లో విత్తనాలు చల్లడం, ఏప్రిల్‌లో పంట కోత ప్రారంభమవుతాయి.

### దిల్లీలో ట్రాఫిక్ కష్టాలకు చెక్

ఇక దిల్లీలో ట్రాఫిక్ కష్టాలను తెరదించేందుకు ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ ట్రాఫిక్ నిర్వహణ సిస్టమ్‌ను అమల్లోకి తేనున్నట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు. రూ. 1,789.52 కోట్ల అంచనా వ్యయంతో దిల్లీ పోలీసులు ప్రతిపాదించిన ఐటీఎంఎస్ ప్రాజెక్టును అమలుకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్ట్ 42 గుర్తించిన ట్రాఫిక్ కారిడార్లను కవర్ చేస్తుంది. దీనిని 24 నెలల వ్యవధిలో మూడు దశల్లో అమలు చేస్తారు, ఆ తర్వాత ఐదేళ్లపాటు ఆపరేషన్, నిర్వహణ ఉంటుంది. దేశంలో కొత్త క్రిమినల్ చట్టం దీమీఖా అమల్లోకి వచ్చాక కేసుల విచారణ అనూహ్యంగా వేగవంతమైందని తెలిపారు. ఇటీవల ఓ హత్య కేసులో కేవలం ఎనిమిది రోజుల్లోనే న్యాయస్థానం తీర్పు వెలువరించడం ఈ చట్టం పటిష్టతకు నిదర్శనమని స్పష్టం చేశారు.

### గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశకు కేబినెట్ ఆమోదం

దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఏకంగా లక్షా 86 వేలకోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశకు కేబినెట్ మార్గం సుగమం చేసింది. 2030 నాటికి 500 +ఔ పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది ఎంతో కీలకంగా మారనుంది. దీని వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య 135 +ఔ వరకు పునరుత్పాదక శక్తిని తరలించడానికి వీలుగా రాష్ట్ర-స్థాయి విద్యుత్ ప్రసార వ్యవస్థను (×ఆబూ) బలోపేతం చేస్తుంది. పీఎం ధార కింద గ్రిడ్, స్మార్ట్‌గ్రిడ్ మౌలికసదుపాయాల్ని మెరుగుపర్చడంతోపాటు అత్యాధునిక బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా ఇంధన సరఫరాకు చర్యలు చేపట్టనున్నారు.

## రష్యా సైన్యంలో చేరొద్దు..
## అది చాలా ప్రమాదకరం!

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

## మిస్ గ్లోబ్ ఇండియాగా
## జైపూర్ సుందరి నిహారిక రాథోడ్
## అంతర్జాతీయ పోటీల్లో భారత్ నుంచి పోటీకి సై!

పింక్ సిటీ జైపూర్‌కు చెందిన నిహారిక రాథోడ్ ప్రతిష్టాత్మక ‘ది మిస్ గ్లోబ్ ఇండియా’ కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఘనత సాధించడం ద్వారా అంతర్జాతీయ పోటీలకు ఆమె అర్హత సాధించారు. వచ్చే నెలలో జరగబోయే ‘ది మిస్ గ్లోబ్’ పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇంకా ఈ అంతర్జాతీయ అందాల పోటీల్లో రాజస్థాన్ నుంచి పోటీపడుతున్న తొలి కంటెస్టెంట్ నిహారికనే కావడం విశేషం. ఇప్పటివరకు రాజస్థాన్ నుంచి ఒక్కరు కూడా ఈ పోటీల్లో పాల్గొనలేదు. ఇప్పుడు థాయిలాండ్ పుకెట్ వేదికగా త్వరలో జరగనున్న అంతర్జాతీయ ది మిస్ గ్లోబ్ అందాల పోటీల్లో నిహారిక వివిధ దేశాల నుంచి వచ్చే మోడళ్లతో పోటీ పడనున్నారు. నిహారిక విషయానికి వస్తే ప్రస్తుతం ఈమె జైపూర్ నేషనల్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ (ఎాదీ) మొదటి సంవత్సరం చదువుతున్నారు. చదువులో రాణిస్తూనే మరోవైపు మోడలింగ్, ఫ్యాషన్ రంగాల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ క్రమంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె తండ్రి అజిత్ సింగ్ రాథోడ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా, తల్లి మీనాక్షి రాథోడ్ గృహిణి. గతంలో నిహారిక మిస్ రాజస్థాన్ పోటీల్లో కూడా పార్టిసిపేట్ చేశారు. అయితే అప్పుడు ఆమె కాలికి తీవ్ర గాయమై విజేతగా నిలవలేకపోయారు. అయినప్పటికీ ఏ మాత్రం నిరాశ, నిస్పృహలకు లోనవకుండా తనను తాను మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగారు. ఇక మిస్ ఫ్యూజన్ ఇండియా ప్లాట్‌ఫామ్ ద్వారా నిహారికకు ది మిస్ గ్లోబ్ ఇండియా కిరీటం దక్కింది. దేశవ్యాప్తంగా ఉన్న ఎందరో ప్రతిభావంతుల్ని దాటుకొని ఆమె విజేతగా నిలిచారు. బుధవారం రోజు (2026, సెప్టెంబర్ 30) నిర్వాహకులు దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ది మిస్ గ్లోబ్ ఇండియా, మిస్ ఓషన్ ఇండియా, మిస్ ప్లానెట్ ఇండియా కిరీటాలను అందజేసినట్లు మిస్ ఫ్యూజన్ ఇండియా ఫౌండర్, నిహారిక మెంటర్ యోగేష్ మిశ్రా వెల్లడించారు. 2024లో సీఎం సౌమ్య, అంతకుముందు 2022లో అర్షియా సరీన్ ఈ మిస్ గ్లోబ్ ఇండియా పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఇప్పుడు థాయిలాండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ అందాల పోటీల్లో పాల్గొనేందుకు నిహారిక సిద్ధమవుతున్నారు. ఇందుకోసం జైపూర్‌లో ఆమెకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నేషనల్ కాస్ట్యూమ్, ఈవినింగ్ గౌన్ రౌండ్ల కోసం జైపూర్‌కు చెందిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు ఆమె కోసం భారతీయ సంస్కృతి, రాజస్థానీ సంప్రదాయాలతో ఆధునిక ఫ్యాషన్‌ను ప్రతిబింబించేలా ప్రత్యేక దుస్తులను డిజైన్ చేస్తున్నారు.



# 406 కొట్టేశారు.. చరిత్ర తిరగరాశారు!

## విండీస్ భారీ స్కోరును మంచినీళ్లలా ఛేదించిన గిల్ సేన

**43.3 ఓవర్లలోనే లక్ష్యం పూర్తి.. భారత్‌కు 8 వికెట్ల ఘన విజయం**

**223 పరుగులతో అజేయంగా నిలిచిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్**

**101 పరుగులతో రోహిత్ శర్మ విధ్వంసం..**

**మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో వన్డే సిరీస్ భారత్ సొంతం**

నాలుగు వందలకు పైగా లక్ష్యం.. ఎదురుగా 405 పరుగుల భారీ స్కోరు.. కానీ టీమిండియా బ్యాటర్ల ముందు అదంతా చిన్నబోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అజేయ ద్విశతకంతో చెలరేగగా, రోహిత్ శర్మ శతకంతో విరుచుకుపడ్డాడు. ఫలితంగా వెస్టిండీస్ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 43.3 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2--0తో కైవసం చేసుకుంది. ఇది భారత్‌కు వన్డేల్లో అత్యధిక విజయవంతమైన లక్ష్య ఛేదన కాగా, వన్డే చరిత్రలో రెండో అత్యధిక విజయవంతమైన ఛేదనగా నమోదైంది.

### గిల్ కొట్టుడు.. రోహిత్ బాదుడు

భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు గిల్, రోహిత్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. రోహిత్ 75 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 101 పరుగులు చేశాడు. ఈ క్రమంలో వన్డేల్లో 12 వేల పరుగుల మైలురాయిని కూడా అధిగమించాడు. రోహిత్ వెనుదిరిగినా గిల్ దూకుడు మాత్రం ఆగలేదు. విండీస్ బౌలింగ్‌ను ఊచకోత కోస్తూ 133 బంతుల్లో 26 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 223 పరుగులు చేశాడు. 117 బంతుల్లోనే ద్విశతకం పూర్తి చేసి వన్డేల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఇది గిల్‌కు వన్డేల్లో రెండో ద్విశతకం.

### విండీస్‌కు మూడు సెంచరీలు.. అయినా ఓటమే!

అంతకుముందు వెస్టిండీస్ 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 405 పరుగుల భారీ స్కోరు చేసింది. జాన్ క్యాంప్‌బెల్ 101, కెప్టెన్ షాయ్ హోప్ 104, అమిర్ జాంగూ 114 పరుగులతో శతకాలు బాదారు. వన్డేల్లో వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక జట్టు స్కోరు. ఒకే వన్డే ఇన్నింగ్స్‌లో ముగ్గురు విండీస్ బ్యాటర్లు శతకాలు సాధించడం కూడా ఇదే తొలిసారి. అయితే వారి పరుగుల పర్వతాన్ని భారత బ్యాటర్లు అలవోకగా కరిగించారు. 406 పరుగుల లక్ష్యాన్ని 39 బంతులు మిగిలుండగానే ఛేదించి సరికొత్త చరిత్ర సృష్టించారు. గతంలో భారత్ అత్యధికంగా 2013లో ఆస్ట్రేలియాపై 360కి పైగా లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించగా, ఇప్పుడు ఆ రికార్డు చెరిగిపోయింది.

# కొత్త శకం మొదలు

## బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా దిగ్గజ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా!

**అజిత్ అగార్కర్ స్థానంలో తాత్కాలిక సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు**

భారత క్రికెట్‌లో పురుషుల జాతీయ సెలెక్షన్ కమిటీకి సంబంధించి అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి అజిత్ అగార్కర్ తప్పుకోవడంతో, నలుగురు సభ్యుల జాతీయ సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక అధిపతిగా భారత మాజీ దిగ్గజ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా బాధ్యతలు చేపట్టారు. రాబోయే రోజుల్లో ఆయననే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా బీసీసీఐ నియమించే అవకాశం ఉన్నట్లు క్రికెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. వెస్టిండీస్‌తో రెండో వన్డే కోసం భారత జట్టు గువాహటికి చేరుకున్న వేళ, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జాతీయ సెలెక్షన్ కమిటీతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. బర్సాపరా స్టేడియం వేదికగా జరిగిన ఈ భేటీలో సెలెక్టర్లు ప్రజ్ఞాన్ ఓజా, శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ పాల్గొన్నారు. సాధారణంగా ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో నలుగురు సెలెక్టర్లు ఒకేసారి జట్టుతో ఉండటం అరుదు కాగా, రాబోయే న్యూజిలాండ్ పర్యటనకు జట్ల ఎంపిక మరియు ఆటగాళ్ల పనిభారం (వర్క్‌లోడ్) నిర్వహణపై



వీరంతా తీవ్రంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు భారత జట్టు న్యూజిలాండ్‌లో విస్తృతంగా పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా 5 టీ20లు, 5 వన్డేలు మరియు 2 టెస్టు మ్యాచ్‌లను టీమిండియా ఆడనుంది. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుండగా, అక్టోబర్ 24 నుంచి నవంబర్ 10 వరకు ఇండియా 'ఏ' జట్టు కూడా న్యూజిలాండ్‌లో 3 నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లను ఆడనుంది. రాబోయే 2027 వన్డే ప్రపంచకప్ దృష్ట్యా ఈ పర్యటన అత్యంత కీలకం కానున్న నేపథ్యంలో, ప్రజ్ఞాన్ ఓజా సారథ్యంలోని నూతన సెలెక్షన్ కమిటీ నిర్ణయాలు భారత క్రికెట్ భవిష్యత్తును దిశానిర్దేశం చేయనున్నాయి.

# ఆసియాడ్‌లో భారత్‌కు 'గోల్డ్ రష్'

**ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు** | **ఆర్చరీలో భారత్ క్లీన్‌స్వీప్**

- మహిళల, మిక్స్‌డ్, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో పసిడి పంట
- ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్‌లో నీరూ ధండా-కైనన్ చెనాయ్ జోడీకి స్వర్ణం
- మహిళల కాంపౌండ్ ఫైనల్లో 238 పాయింట్లతో ప్రపంచ రికార్డు సమం
- రెండు స్వర్ణాలతో మెరిసిన తెలంగాణ ఆర్చర్ చికితా తనిపర్తి







: ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు బుధవారం పసిడి పంట పండించారు. ఆర్చరీలో మూడు, షూటింగ్‌లో ఒకటి చొప్పున ఒకేరోజు నాలుగు స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. మహిళల కాంపౌండ్ టీమ్, కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో భారత ఆర్చర్లు స్వర్ణాలను




ఊడ్చేయగా.. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ షూటింగ్‌లో నీరూ ధండా-కైనన్ చెనాయ్ జోడీ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

### ప్రపంచ రికార్డును సమం చేస్తూ పసిడి

మహిళల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ వెన్నం, పృథికా ప్రదీప్, చికితా తనిపర్తితో కూడిన భారత జట్టు చైనాను 238-234తో ఓడించి స్వర్ణం సాధించింది. 238 పాయింట్లతో ప్రపంచ రికార్డును సమం చేసిన భారత మహిళలు.. హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో చికితా తనిపర్తి-సాహిల్ జాదవ్ జోడీ ఉత్కంఠ పోరులో దక్షిణ కొరియాను మట్టికరిపించింది. నిర్ణీత రౌండ్ల తర్వాత 157-157తో స్కోరు సమం కావడంతో షూటాఫ్ నిర్వహించారు. ఇందులో చికితా, సాహిల్ చెరో 10 పాయింట్లు సాధించగా.. కొరియా చివరి బాణం 9 పాయింట్లకే పరిమితమైంది. ఈ విజయంతో భారత్‌కు స్వర్ణంతోపాటు 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కోటా కూడా దక్కింది. పురుషుల కాంపౌండ్ టీమ్‌లో కుశాల్ దలాల్, సాహిల్ జాదవ్, గణేశ్ మణిరత్నంతో కూడిన భారత జట్టు చైనాపై 238--237తో ఒక్క పాయింట్ తేడాతో విజయం సాధించింది. దీంతో మహిళలు, మిక్స్‌డ్, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో మూడు స్వర్ణాలనూ భారత్ క్లీన్‌స్వీప్ చేసింది.

### షూటింగ్‌లోనూ పసిడి గురి

ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ షూటింగ్‌లో నీరూ ధండా--కైనన్ చెనాయ్ జోడీ 34 పాయింట్లతో స్వర్ణం సాధించింది. ఖతార్ 32 పాయింట్లతో రజతం, చైనా 23 పాయింట్లతో కాంస్యం దక్కించుకున్నాయి. తొలి సిరీస్‌లో వెనుకబడిన భారత జోడీ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుని పసిడిని చేజిక్కించుకుంది. 34 పాయింట్ల ప్రదర్శనతో ఆసియా రికార్డును కూడా బద్దలు కొట్టింది. నీరూ ధండాకు ఈ క్రీడల్లో ఇది రెండో స్వర్ణం, మూడో పతకం.

### రెండు స్వర్ణాలతో తెలంగాణ బిడ్డ చికిత

మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించిన తెలంగాణకు చెందిన చికితా తనిపర్తి ఒకేరోజు రెండు పసిడి పతకాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల జట్టులో ప్రపంచ రికార్డు స్కోరును సమం చేయడంలో భాగస్వామి కావడంతోపాటు.. మిక్స్‌డ్ టీమ్‌లో ఒత్తిడితో కూడిన షూటాఫ్‌లో 10 పాయింట్ల బాణంతో విజయాన్ని ఖాయం చేసింది. నా్రీఎఎజూఅఎం

చికిత సాధించిన రెండు స్వర్ణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపినట్లు మీరు అందించిన ప్రకటన పేర్కొంటోంది. ఆమె పట్టుదల, సాధన యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని ప్రశంసిస్తూ.. తల్లిదండ్రులు, కోచ్‌లకూ అభినందనలు తెలిపారు.



# సెమీస్‌కూ 'వరుణ' గండం?

## మ్యాచ్ రద్దయితే భారత్ ఫైనల్‌కు!

**అక్టోబర్ ఒకటిన శ్రీలంకతో టీమిండియా సెమీఫైనల్ పోరు**




అయిచి-నగోయా ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌ను వరుణుడు వెంటాడుతున్నాడు. నాలుగు క్వార్టర్ ఫైనల్స్ కూడా వర్షం కారణంగా ఒక్క బంతి పడకుండానే రద్దయ్యాయి. దీంతో టోర్నమెంట్‌లో ఉన్నత సీడింగ్ ఆధారంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ సెమీఫైనల్‌కు చేరాయి. అక్టోబర్ ఒకటిన జరిగే సెమీస్‌లో భారత్-శ్రీలంక, పాకిస్థాన్-బంగ్లాదేశ్ తలపడనున్నట్లు ఐసీసీ ధ్రువీకరించింది. భారత్-అఫ్గానిస్థాన్ క్వార్టర్ ఫైనల్ భారీ వర్షంతో రద్దవడంతో ఉన్నత సీడింగ్ కలిగిన టీమిండియా సెమీస్‌కు చేరింది. శ్రీలంక--నేపాల్ మ్యాచ్‌కూ ఇదే పరిస్థితి ఎదురవగా శ్రీలంక ముందంజ వేసింది. పాకిస్థాన్-హాంకాంగ్, బంగ్లాదేశ్-మలేషియా మ్యాచ్‌లు కూడా వర్షార్పణం కావడంతో ఉన్నత సీడింగ్ కలిగిన పాకిస్థాన్, బంగ్లాదేశ్ సెమీస్ బెర్తులు దక్కించుకున్నాయి.

### రద్దయితే భారత్‌కే ఫైనల్ బెర్త్

నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో గురువారం మధ్యాహ్నం స్థానిక కాలమానం ప్రకారం 2 గంటలకు భారత్-శ్రీలంక సెమీఫైనల్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. వర్షం లేదా మైదానం పరిస్థితుల కారణంగా సెమీఫైనల్‌లో ఫలితం సాధ్యం కాకపోతే టోర్నమెంట్ సీడింగ్ నిబంధన భారత్‌కు అనుకూలంగా మారనుంది. శ్రీలంక కంటే ఉన్నత సీడింగ్ కలిగిన భారత్ ఫైనల్‌కు చేరుతుంది. క్వార్టర్ ఫైనల్స్‌లోనూ ఇదే నిబంధన ఆధారంగా నాలుగు జట్లు ముందంజ వేశాయి.

### ఫైనల్‌కు మాత్రం కొత్త రూల్

అయితే ఈసారి ఫైనల్ విషయంలో కీలక మార్పు ఉంది. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత్-అఫ్గానిస్థాన్ ఫైనల్ వర్షంతో రద్దవడంతో ఉన్నత ర్యాంకింగ్ ఆధారంగా భారత్‌కు స్వర్ణం దక్కింది. 2026లో మాత్రం ఫైనల్ పూర్తిగా వర్షార్పణమైతే ర్యాంకింగ్ ఆధారంగా విజేతను నిర్ణయించరు. ఇద్దరు ఫైనలిస్టులకు సంయుక్తంగా స్వర్ణ పతకం అందించనున్నట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఫైనల్‌కు రిజర్వ్ డే కూడా లేదు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో ఉన్న భారత్ మరోసారి స్వర్ణాన్ని నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతోంది. అయితే ముందుగా శ్రీలంకతో సెమీఫైనల్ అడ్డంకిని దాటాల్సి ఉంది.

## సంపాదకీయం

## ఖనిజ రాష్ట్రాల మంట!

ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ (బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్ స్వయంగా వీధుల్లోకి దిగి గనుల చట్ట సవరణకు వ్యతిరేకంగా ఉద్యమానికి నాయకత్వం వహించడం అసాధారణ పరిణామం. 2024లో అధికారం కోల్పోయాక తొలిసారిగా ఆయన సోమవారం భువనేశ్వర్‌లో బీజేడీ కార్యకర్తలతో భారీ ప్రదర్శన నిర్వహించి, గనులు-ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ చట్టం, 2026ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర 4.5 కోట్ల ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకే పోరాటమనీ ప్రకటించారు. దేశ ఖనిజ సంపదలో దాదాపు 44 శాతం ఒడిశాలోనే ఉందని, ఈ సవరణ ద్వారా రాష్ట్రం వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందన్నది బీజేడీ ఆరోపణ. చర్చ లేకుండానే పార్లమెంటులో బిల్లు (ఆగస్టు 12న లోక్‌సభ ఆమోదం) నెగ్గించుకోవడాన్ని ప్రశ్నిస్తూనే.. రాష్ట్రం నుంచి ఎన్నికైన 20మంది బీజేపీ ఎంపీలు మౌనం వహించడాన్నీ పట్నాయక్ ప్రశ్నిస్తున్నారు. ఆందోళన కేవలం భువనేశ్వర్‌కే పరిమితం కాదు, వివిధ జిల్లాలకూ విస్తరించాలని, చట్టం ఉపసంహరించుకోకుంటే ఖనిజ రవాణాను నిలిపివేసి ఆర్థిక దిగ్బంధనం చేపట్టాలని బీజేడీ ప్రకటించింది. కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు కూడా సెప్టెంబరు 29న ప్రత్యేక నిరసన చేపట్టడం, ఈ వివాదం కేవలం ఒడిశాకే పరిమితం కాకుండా జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి ఖనిజ సంపన్న రాష్ట్రాలకూ విస్తరించే సూచనలు స్పష్టం చేస్తోంది. అయితే, కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ మాత్రం ఈ సవరణ రాష్ట్రాల భూమి, ఖనిజాలపై హక్కులనుగానీ, పన్నులు విధించే అధికారాన్నిగానీ తగ్గించదని స్పష్టం చేసింది. క్లిష్టమైన, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధిని సులభతరం చేయడం, గనుల లీజుదారులకు మరింత వెసులుబాటు కల్పించడమే సవరణ లక్ష్యమన్నది కేంద్రం మాట. గతంలో ప్రతి రాష్ట్రం వేర్వేరుగా పన్నులు విధించేదని, ఇప్పుడు ఏకీకృత, కేంద్ర-నిర్దేశిత పన్ను చట్రం అమల్లోకి వస్తుందని, దీనివల్ల చిన్న, మధ్యతరహా గనుల యజమానులపై పడుతున్న అధిక భారం తొలగి, అందరికీ సమాన, న్యాయబద్ధమైన వ్యవస్థ ఏర్పడుతుందని కేంద్రం వాదిస్తోంది. ఈ వాదనలు పూర్తిగా అసంబద్ధమేమీ కావు. కానీ, ఆర్థిక వ్యవస్థను, ఉపాధి కల్పనను నేరుగా ప్రభావితం చేసే కీలక చట్టాన్ని రూపొందించే ముందు, ఖనిజ సంపన్న రాష్ట్రాలను విశ్వాసంలోకి కేంద్రం తీసుకున్నదా అన్నది ప్రధాన ప్రశ్న.

ఈ వివాదాన్ని అర్థం చేసుకోవాలంటే, 2024 జూలైలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును గుర్తుచేసుకోవాలి. మినరల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో తొమ్మిదిమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో, గనులనుంచి వచ్చే రాయల్టీ పన్ను కాదని, ఖనిజ హక్కులపై, ఖనిజ భూములపై పన్ను విధించే అధికారం శాసనసభలకే ఉంటుందని తీర్పునిచ్చింది. ఆర్థిక సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేసిన ఈ తీర్పును ఒడిశా, జార్ఖండ్‌వంటి రాష్ట్రాలు విజయంగా భావించాయి. ఆ తర్వాత రెండు వారాలకే, ఈ తీర్పును 2005 ఏప్రిల్ నుంచి పునరాధారంగా అమలు చేయవచ్చని కోర్టు స్పష్టం చేయడంతో, రాష్ట్రాలు వెనుకటి బకాయిలను కూడా వసూలు చేసుకునే వీలు కలిగింది. అయితే, ఇప్పుడు 2026 సవరణ చట్టం ద్వారా, ఆ తీర్పు కల్పించిన అధికారాలను కేంద్రం మరోసారి తన నియంత్రణలోకి తెచ్చుకుంటోందన్నది రాష్ట్రాల అభ్యంతరం. కొత్త చట్టం ప్రకారం, రాష్ట్రాలు కొత్త లెవీలు విధించవచ్చు గానీ, అవి కేంద్రం నిర్దేశించిన షరతులకు లోబడే ఉండాలి. అంటే, న్యాయస్థానం ఇచ్చిన స్వేచ్ఛను శాసనం ద్వారా పరిమితం చేస్తున్నారన్న మాట. అంతేకాదు, పెండింగ్‌లో ఉన్న పునరాధార బకాయిలన్నింటినీ ఈ చట్టం రద్దు చేస్తుంది. పైకి చూస్తే ఇది పరిశ్రమకు ఊరటనిచ్చే చర్యలా కనిపించినా, పునరాధార పన్నుల విధానంపట్ల కేంద్రం వైఖరిని ప్రశ్నార్థకం చేస్తుంది. గతంలో పునరాధార పన్నులు విధించబోమని పదేపదే హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, గత ఏడాదే దానికి విరుద్ధంగా వ్యవహరించింది. సఫారి రిట్రీట్స్ కేసులో 2024 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు, వాణిజ్య భవనాల నిర్మాణ వ్యయంపై చెల్లించిన జీఎస్టీకి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే హక్కు కంపెనీలకు ఉందని తీర్పు ఇచ్చింది. అయితే, ఈ తీర్పు నచ్చని కేంద్రం, జీఎస్టీ మండలి సిఫారసు మేరకు 2025 ఫైనాన్స్ చట్టంలో ఒక క్లాజు చేర్చి, 2017 జూలైనుంచే అమల్లోకి వచ్చేలా పునరాధారంగా చట్టాన్ని సవరించి, కోర్టు తీర్పు ప్రయోజనాన్ని రద్దు చేసింది. అంటే, "స్థిరమైన పన్ను విధానం" అని చెబుతూనే, తనకు అనుకూలం కానప్పుడు న్యాయస్థాన తీర్పులనే శాసనం ద్వారా తిప్పికొట్టే ధోరణి కేంద్రంలో కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో, గనుల చట్ట సవరణపై రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న అనుమానాలను కేవలం రాజకీయ ప్రేరేపితమైనవిగా కొట్టిపారేయడం సరికాదు. పార్లమెంటులో సంఖ్యాబలం ఉందన్న ఒక్క కారణంతో ఏ చట్టమైనా రాజకీయ చట్టబద్ధతను, విశ్వసనీయతను దానంతట అదే సంపాదించుకోదు.

ఈ పరిస్థితుల్లో, ఒడిశాతో పాటు ఇతర ఖనిజ సంపన్న రాష్ట్రాలతో కేంద్రం నిజాయితీగా, పారదర్శకంగా చర్చలు జరపడమే సరైన మార్గం, వారి ఆందోళనలను రాజకీయ వ్యతిరేకతగా చిత్రీకరించడం కాదు. ప్రతిపాదిత లెవీ చట్రం, ఆదాయ పంపిణీ విధానం, కేంద్రం ఏకపక్షంగా జోక్యం చేసుకోకుండా రక్షణలు కల్పించే అంశాలపై బహిరంగ చర్చ జరిగితే, కేంద్రీకరణ భయాలను చాలావరకు తొలగించవచ్చు. అంతేకాదు, సహకార సమాఖ్యవాదం అనేది అవసరమైనప్పుడు మాత్రమే వాడుకునే నినాదం కాదని, కీలక ఆర్థిక చట్టాల రూపకల్పనలో, అమలులో అది నిజంగా ప్రతిఫలించే సూత్రమని కూడా కేంద్రం రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. పునరాధార పన్నుల వివాదం ఈ చర్చను మరింత అనివార్యం చేస్తోంది. పరిశ్రమకు, రాష్ట్రాలకు కొత్త చట్రం స్థిరత్వాన్ని, స్పష్టతను, న్యాయబద్ధతను ఇస్తుందని కేంద్రం నమ్మించదలిస్తే, ఆ సూత్రాలను తానే స్థిరంగా పాటించాలి. పెట్టుబడిదారులు, రాష్ట్రాలు స్థిర పన్ను విధానంపై నమ్మకం ఉంచాలని కోరుతూనే, పరిస్థితులు కలిసొచ్చినప్పుడు జోక్యం చేసుకునే అవకాశాన్ని తన చేతిలో ఉంచుకోవడం ఆచరణలో సాధ్యం కాదు. ఈ కొత్త చట్టాన్ని రాష్ట్రాలతో సంప్రదించి, ఏకపక్షంగా కాకుండా, న్యాయబద్ధంగా, ఊహించదగిన రీతిలో అమలు చేస్తామని హామీ ఇచ్చేందుకు కేంద్రానికి ఇదొక చక్కటి అవకాశం. ఆ అవకాశాన్ని వినియోగించుకోకుండా, కేవలం సంఖ్యాబలంతో చట్టాలను నెగ్గించుకుంటూ పోతే, సమాఖ్య వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడమే కాక, రేపు మరిన్ని రాష్ట్రాలు వీధుల్లోకి వచ్చే పరిస్థితి తలెత్తినా ఆశ్చర్యపోనక్కర్లేదు!

---

### పనికొచ్చే పలుకు



## డిజిటల్ డిసిప్లిన్.. వెరీ ఇంపార్టెంట్!

రాత్రి పడుకునే ముందు ఒక్కసారి ఫోన్ చూస్తాం. ఒక మెసేజ్.. ఒక రీల్.. ఒక షార్ట్ వీడియో.. ఒక నోటిఫికేషన్.. "ఇంకో ఐదు నిమిషాలు" అనుకుంటాం. కానీ ఆ ఐదు నిమిషాలు ఎప్పుడు అరగంట అయ్యిందో తెలీదు. చివరికి కళ్లు అలసిపోతాయి. మెదడు మాత్రం ఇంకా ఆన్‌లోనే ఉంటుంది! ఇదే నేటి డిజిటల్ లైఫ్‌స్టయిల్‌లో పెద్ద సమస్య. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినా సరే.. అది మన పక్కనే ఉందన్న ఆలోచన మనలో ఒక చిన్న అప్రమత్తతను కొనసాగిస్తుంది. ఏదైనా కాల్ వస్తుందేమో.. మెసేజ్ వచ్చిందేమో.. ఉదయాన్నే చూసుకోవాల్సిన నోటిఫికేషన్ ఏదైనా ఉందేమో.. ఇలా మన మెదడు పూర్తిగా రిలాక్స్ కావడానికి బదులు "ఏదైనా మిస్ అవుతుందేమో" అనే మూడ్‌లో ఉంటుంది. అందుకే చిన్న ప్రయోగం చేయండి. రాత్రి నిద్రపోయేటప్పుడు ఫోన్‌ను బెడ్‌రూమ్‌లోనే పెట్టకుండా.. వేరే గదిలో పెట్టండి. మొదటి రోజు కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. చేతి వేళ్లు తెలియకుండానే ఫోన్ కోసం వెతుకుతాయి. "అలారం ఎలా?" అనే సందేహం వస్తుంది. ఏదైనా అర్జెంట్ మెసేజ్ వస్తే? సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో? అనే ఆలోచన కూడా రావచ్చు. కానీ అదే మీకు ఒక విషయం చెబుతుంది. "మీకు ఫోన్ అవసరమా.. లేక ఫోన్‌ను చెక్ చేయాలనే అలవాటే అవసరమైందా?" అని. రెండో రోజు నుంచి చిన్న మార్పు మొదలవుతుంది. పడుకునే ముందు స్క్రీన్ టైమ్ తగ్గుతుంది. మెదడుకు "ఇక పని లేదు.. విశ్రాంతి సమయం" అనే సంకేతం అందుతుంది. నిద్రకు ముందు చివరి అరగంటను రీల్స్, చాట్స్, నోటిఫికేషన్లకు కాకుండా మీకే కేటాయించే అవకాశం వస్తుంది.

ఒక పుస్తకం చదవొచ్చు. కొద్దిసేపు నిశ్శబ్దంగా కూర్చోవచ్చు. మరుసటి రోజు చేయాల్సిన పనులను చిన్న నోట్‌గా రాసుకోవచ్చు. కుటుంబ సభ్యులతో రెండు మాటలు మాట్లాడవచ్చు. లేదంటే ఏమీ చేయకుండా ప్రశాంతంగా పడుకోవచ్చు.

"డూ నథింగ్" కూడా ఒక హెల్తీ హ్యాబిట్"

ఇక్కడ అసలు మార్పు నిద్రలో మాత్రమే కాదు. లైఫ్‌స్టయిల్‌లో మొదలవుతుంది. మన ఉదయం ఎలా మొదలవుతుందో.. మన రోజు మొత్తం మూడ్‌పై దాని ప్రభావం ఉంటుంది. నిద్ర లేవగానే ఫోన్ నోటిఫికేషన్లు చూడకుండా.. ముందుగా కిటికీ తెరవడం, నీళ్లు తాగడం, కొద్దిసేపు నడవడం, వ్యాయామం చేయడం లేదా కుటుంబంతో మాట్లాడటం మొదలుపెడితే.. రోజు ప్రారంభమే మన నియంత్రణలోకి వస్తుంది. ఇది చిన్న విషయంలా అనిపించవచ్చు. కానీ లైఫ్‌స్టయిల్ మార్పులు ఎప్పుడూ పెద్ద నిర్ణయాలతో మొదలు కావు. చిన్న అలవాట్లతోనే మొదలవుతాయి. ఈరోజు ఫోన్‌ను బెడ్‌రూమ్ బయట పెట్టడం.. రేపు నిద్రకు ముందు సోషల్ మీడియా సమయాన్ని తగ్గించడం.. ఆ తర్వాత ఉదయం లేవగానే ఫోన్ చూడకుండా ఉండటం.. ఇలా ఒక్కో చిన్న మార్పు కలిస్తే మనకు తెలియకుండానే డిజిటల్ డిసిప్లిన్ ఏర్పడుతుంది.

రాత్రి ఫోన్‌ను దూరంగా పెట్టడమంటే టెక్నాలజీని తిరస్కరించడం కాదు. టెక్నాలజీకి మన జీవితంలో ఒక పరిమితి గీయడం. రెండు వారాలు ఈ చిన్న ప్రయోగం చేసి చూడండి. నిద్ర ఎలా మారింది? ఉదయం లేవగానే మీ మూడ్ ఎలా ఉంది? రోజంతా ఏకాగ్రత ఎలా ఉంది? ఫోన్ చెక్ చేయాలనే ఆత్రుత తగ్గిందా? మీ కోసం మీరు కేటాయించుకున్న సమయం పెరిగిందా? ఈ ప్రశ్నలకు మీరే సమాధానం చెప్పుకోండి. ఎందుకంటే మంచి లైఫ్‌స్టయిల్ అంటే ఎక్కువ పనులు చేయడం కాదు. మనకు అవసరం లేని అలవాట్లను నెమ్మదిగా వదిలి.. మనకు అవసరమైన జీవితాన్ని తిరిగి నిర్మించుకోవడం!

---

# తీరం పెరిగిందా? లెక్క మారిందా?!



"ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం పొడవెంత?" -గ్రూప్స్ మొదలు సివిల్స్ దాకా ఏ పోటీ పరీక్ష పెట్టినా, జనరల్ నాలెడ్జ్ పుస్తకాల్లో ఠంచనుగా కనిపించే ప్రశ్న ఇది. జవాబు కూడా అందరికీ కంఠోపాఠమే, 973.70 కిలోమీటర్లు అని. దేశంలో గుజరాత్ తర్వాత రెండో అతిపెద్ద తీరప్రాంతం. యాభై ఏళ్లుగా పాఠ్యపుస్తకాల్లో, జీకే గైడ్లలో, ఉపాధ్యాయుల నోటివెంట చెక్కుచెదరకుండా నిలిచిన ఈ లెక్క ఇప్పుడు తప్పుకానుంది. కారణం.. ఏపీ తీరం పొడవు అకస్మాత్తుగా 79.37 కిలోమీటర్లు పెరిగి 1,053.07 కిలోమీటర్లకు చేరింది. అంటే, గతంతో పోలిస్తే 8.15 శాతం వృద్ధి. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడించిన ఈ కొత్త లెక్కలు, జాతీయ మారిటైమ్ సెక్యూరిటీ కో-ఆర్డినేటర్ (ఎన్ఎంఎస్‌సీ) రూపొందించిన నూతన విధివిధానాల ప్రకారం జరిగిన "రీ-వెరిఫికేషన్" ఫలితం. కేవలం ఏపీ ఒక్కటే కాదు.. యావత్ భారతదేశ తీరప్రాంత పొడవే మారిపోయింది. 1970లో ఇండియన్ నేవల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్, సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా లెక్కగట్టిన 7,516.60 కిలోమీటర్ల జాతీయ తీరప్రాంతం, ఇప్పుడు ఏకంగా 11,098.81 కిలోమీటర్లకు చేరింది. అంటే 48 శాతం పెరుగుదల. ఈ మార్పు ఇవాళ్టిది కాదు.. డెహ్రాడూన్‌లోని నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆర్గనైజేషన్ (ఎన్‌హెచ్‌ఓ) 2019లోనే 11,084.50 కిలోమీటర్ల ప్రాథమిక అంచనాను కోస్తా రక్షణ, అభివృద్ధి సలహా కమిటీ (సీడీఏసీ) ముందుంచింది. ఆ తర్వాత మరింత మెరుగైన సాంకేతికతతో సరిచూసి, 2025 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 11,098.81 కిలోమీటర్ల తుది గణాంకాన్ని ప్రకటించింది. యాభై నాలుగేళ్ల నాటి లెక్కను తుడిచిపెట్టిన ఈ కొత్త సంఖ్య, భారతదేశ భౌగోళిక అవగాహననే తిరగరాస్తోంది.

మరి, సముద్రం నిజంగానే భూమిని ఆక్రమించి తీరాన్ని పొడిగించిందా? ఇసుక తిన్నెలు కొత్తగా ఏర్పడ్డాయా? అలాంటిదేమీ లేదు. ఇది కేవలం కొలత తీరు మారడం వల్ల వచ్చిన మార్పు మాత్రమేనని సముద్ర శాస్త్ర నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే జాతీయ సముద్ర అధ్యయన సంస్థ చీఫ్ సైంటిస్ట్ వివరించిన ప్రకారం, 1970నాటి సర్వేలో ప్రతి యాభై కిలోమీటర్లకూ ఒక సరళరేఖ గీస్తూ, తీరాన్ని దాదాపుగా ఒక "సాదా గీత"లా కొలిచారు. తీరంలోని చిన్న చిన్న మలుపులు, పాయలు, సెలయేటి నోళ్లు, ఇసుక దిబ్బల వంపులు.. వీటన్నింటినీ ఆ నాటి సాంకేతికత పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు జీపీఎస్, ఉపగ్రహ ఆధారిత అత్యున్నత రిజల్యూషన్ మ్యాపింగ్ అందుబాటులోకి రావడంతో, ప్రతి అంగుళాన్ని, ప్రతి వంపును, ప్రతి పాయనూ కచ్చితంగా గుర్తించి కొలుస్తున్నారు. తీరం సూటిగా కాకుండా వాస్తవంగా ఎంత మెలికలు తిరిగిందో అంతా లెక్కలోకి రావడంతో, కాగితం మీద పొడవు ఒక్కసారిగా పెరిగినట్టు కనిపిస్తోంది. ఈ మార్పు తీవ్రత రాష్ట్రాలవారీగా చూస్తే మరింత స్పష్టంగా అర్థమవుతుంది. అప్పటికీ ఇప్పటికీ అగ్రస్థానంలో నిలిచిన గుజరాత్ తీరం 1,214.70 నుంచి 2,340.62 కిలోమీటర్లకు (92.69 శాతం వృద్ధి) ఎగబాకి, తన స్థానాన్ని పదిలం చేసుకుంది. తమిళనాడు తీరం 906.90 నుంచి 1,068.69 కిలోమీటర్లకు పెరిగి, ఏకంగా ఏపీని మూడో స్థానానికి నెట్టేసింది. సున్దర్‌బన్ డెల్టా పాయలను కచ్చితంగా మ్యాప్ చేయడంవల్ల పశ్చిమ బెంగాల్ తీరం 157.50 నుంచి ఏకంగా 721.02 కిలోమీటర్లకు (అంటే నాలుగున్నర రెట్లు) దూసుకుపోవడం విశేషం. మహారాష్ట్ర 652.60 నుంచి 877.97కు, కేరళ 569.70 నుంచి 600.15కు, ఒడిశా 476.40 నుంచి 574.71కు చేరుకున్నాయి. ద్వీపసమూహాల్లో అండమాన్-నికోబార్ దీవుల తీరం 1,962 నుంచి ఏకంగా 3,083.50 కిలోమీటర్లకు ఎగసి, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోకెల్లా అతి పొడవైన తీరంగా నిలిచింది. సముద్రం ఒక్క అంగుళమూ ముందుకు జరగలేదు. మన కొలిచే కళ్లు మాత్రం మరింత సునిశితంగా మారాయి, అంతే!

ఈ గణాంక మార్పు కేవలం పోటీ పరీక్షల జీకే ప్రశ్నలకే పరిమితం కాదు. ప్రస్తుత పరిస్థితులతో ముడిపడిన అనేక ఆచరణాత్మక అంశాలకూ ఇది కీలకం. దేశ భద్రత, ఇంధన భద్రత లక్ష్యాలతో కేంద్రం ఏర్పాటు చేసిన నేషనల్ మారిటైమ్ సెక్యూరిటీ కో-ఆర్డినేటర్ వ్యవస్థ, తీవ్రవాదం, సముద్రపు దొంగతనాలు, మాదకద్రవ్యాలు, అక్రమ ఆయుధాల రవాణా, చట్టవిరుద్ధ మత్స్యవేటలను కట్టడి చేయడంతోపాటు, సముద్ర చట్టాల సమర్థ అమలును కూడా పర్యవేక్షిస్తుంది. కచ్చితమైన తీర కొలతలు లేకుండా ఈ పర్యవేక్షణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదు. ఇక ఆంధ్రప్రదేశ్‌కు వస్తే, సుదీర్ఘ తీరప్రాంతం ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక వ్యూహంలో కేంద్రబిందువుగా మారింది. ఇటీవలే కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విశాఖలో మాట్లాడుతూ, సుదీర్ఘ తీరం గల ఏపీకి "బ్లూ ఎకానమీ" ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, డీప్ ఓషన్ మిషన్ ప్రాజెక్టు ఇందుకు కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో, హిందూ మహాసముద్రంలో ఏటా 4 మిల్లీమీటర్ల చొప్పున సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని, తీర ప్రాంత కోత, తుపాన్ల తీవ్రతపై పరిశోధనలు జరుగుతున్నాయని కూడా ఆయన వెల్లడించారు. అంటే, కొలత పెరిగినా, పర్యావరణపరంగా తీరం ఎదుర్కొంటున్న సవాళ్లు మాత్రం అలాగే ఉన్నాయి. రాష్ట్రంలో మారిటైమ్ బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విశాఖ నుంచి అమరావతికి తరలించడం వెనుక కూడా, తడనుంచి ఇచ్ఛాపురం వరకూ విస్తరించిన తీరం మొత్తాన్ని రాజధాని నుంచి సమన్వయం చేయాలన్న ఆలోచన ఉందని చర్చ సాగుతోంది. మరోవైపు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చీరాల పరిధిలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం వంటి తీరాల్లో పర్యాటక మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలను జలమార్గాల ద్వారా అనుసంధానించే సీప్లేన్ ప్రాజెక్టుకు కేంద్రం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా, తీరప్రాంతాన్ని రాష్ట్ర అభివృద్ధి నమూనాలో మరింత లోతుగా భాగం చేస్తున్న సంకేతమే. ఇన్ని పరిణామాల నడుమ, పోటీ పరీక్షల అభ్యర్థులు మాత్రం ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇకపై "ఏపీ తీరం 973.70 కిలోమీటర్లు, దేశంలో రెండోస్థానం" అని రాస్తే మార్కు కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. సరైన సమాధానం.. "1,053.07 కిలోమీటర్లు, దేశంలో మూడోస్థానం." దేశ మొత్తం తీరం "7,516 కాదు, 11,098.81 కిలోమీటర్లు." యాభై నాలుగేళ్ల సరళరేఖ స్థానంలో, ఇప్పుడు ప్రతి మలుపునూ కొలిచే కచ్చితత్వం చోటుచేసుకుంది. తీరం జరగలేదు.. కానీ, తీరాన్ని చూసే మన దృష్టే విశాలమైంది!! ■

---



మీరు ఎక్కడికి వెళ్లాలో తెలియకపోతే.. ఎంత వేగంగా పరిగెత్తినా ప్రయోజనం ఉండదు. విజయమూ అంతే. మనసులో మీ గమ్యం స్పష్టంగా కనిపించకపోతే.. దాని వైపు వేసే అడుగులు తడబడుతూనే ఉంటాయి. మీరు సాధించాలనుకునే విజయాన్ని ముందుగా మీ ఊహలో స్పష్టంగా చూడండి. అక్కడికి చేరుకున్న మిమ్మల్ని మీరు మనసులో ఒక్కసారి ఊహించుకోండి. ఆ చిత్రం ఎంత స్పష్టంగా ఉంటే.. దాన్ని నిజం చేసే మీ ప్రయత్నం అంత బలంగా ఉంటుంది. మనసులో మొదలైన విజయం.. జీవితంలో నిజమయ్యే అవకాశాలు ఎక్కువ.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## తాబేలుపై టూరిజం.. ఇదేం రీల్ రా బాబూ!



సోషల్ మీడియాలో వైరల్ కావాలంటే ఏం చేయాలి? ఏదైనా వెరైటీగా చేయాలి.. కానీ మరీ ఇలా కాదు! ఉక్రెయిన్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్లు వాడిమ్ ఒలెనిక్, ఒలెనా క్రావ్‌చెంకో చేసిన పని ఇప్పుడు నెటిజన్లకు షాక్‌తో పాటు నవ్వు తెప్పిస్తోంది. ఒమన్‌లోని రాస్ అల్ జిన్జ్ టర్టిల్ రిజర్వ్‌లో గుడ్లు పెట్టేందుకు వచ్చిన సముద్ర తాబేలుపై కూర్చుని మరీ వీడియో తీశారు. అంతేకాదు.. తాబేలు పిల్లలను చేతుల్లో పట్టుకుని ఫొటోలు దిగారు. 'కంటెంట్' కోసం తాబేలును కష్టపెట్టారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రీల్ కోసం రియల్ లైఫ్ రిస్క్ అవసరమా!

## ఒకేసారి మూడు ఓటీటీల్లోకి 'అమీర్ లోగ్'




టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగాలతో వస్తున్న చిన్న చిత్రాలు ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి. పెద్దగా అంచనాలు లేకుండా, పూర్తిగా నూతన నటీనటులతో తెరకెక్కిన విభిన్నమైన కామెడీ డ్రామా సినిమా 'అమీర్ లోగ్'. రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గత నెల 21వ తేదీన థియేటర్లలోకి వచ్చి నిశ్శబ్దంగా ప్రేక్షకులను పలకరించింది. అయితే ఆ సమయంలో సరైన ప్రమోషన్స్ లేకపోవడం, అదే సమయంలో రవితేజ 'ఇరుముడి' సినిమా ప్రభావం గట్టిగా ఉండటంతో ఈ చిత్రం థియేట్రికల్ రన్‌లో పెద్దగా బజ్ సృష్టించలేకపోయింది. చాలామంది ప్రేక్షకులకు ఈ సినిమా థియేటర్లలో రిలీజైన సంగతి కూడా తెలియదు. అయితే, ఈ చిన్న సినిమా ఇప్పుడు ఏకకాలంగా మూడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలోకి అడుగుపెట్టి రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ చిత్రం 'ఆహా', 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'సన్ నెక్స్ట్' ఓటీటీలలో స్ట్రీమింగ్‌కు అందుబాటులో ఉంది. కథ విషయానికి వస్తే.. హైదరాబాద్‌లోని ఓ అందమైన బస్తీ నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. జీవితంపై ఎలాంటి పెద్ద లక్ష్యాలు లేకుండా, జులాయిగా తిరిగే ముగ్గురు ప్రాణ స్నేహితులు శ్రీను (వీజ హరి), ఫరూక్ (మనోజ్), మల్లేశ్ (శశిధర్) కథే ఈ చిత్రానికి ప్రధాన కేంద్రం. ఏ పనీ చేయకుండా తిరుగుతూ, తాగుతూ కాలం వెళ్లదీస్తున్న వీరికి, అదే బస్తీకి చెందిన నజీర్ (సాయియోగి)తో క్రికెట్ విషయంలో తీవ్రమైన గొడవ జరుగుతుంది.



## 13 ఏండ్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన రాజ్‌కుమార్ రావు మాస్టర్ పీస్ 'షాహిద్'..

బాలీవుడ్ ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ రావు కెరీర్‌లో క్లాసిక్‌గా నిలిచిన 'షాహిద్' సినిమా ఎట్టకేలకు డిజిటల్ స్క్రీన్‌పై సందడి చేయడానికి సిద్ధమైంది. దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కించిన ఈ బయోగ్రాఫికల్ డ్రామా చిత్రం, థియేటర్లలో విడుదలైన సుమారు 13 సంవత్సరాల తర్వాత ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చింది. ప్రస్తుతం ఈ చిత్రం హిందీ భాషలో స్ట్రీమింగ్ అవుతుంది. మానవ హక్కుల కోసం పోరాడిన ప్రముఖ న్యాయవాది షాహిద్ అజ్మీ నిజ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముంబైలో ఉగ్రవాద ఆరోపణలు ఎదుర్కొంటూ తప్పుడు కేసుల్లో ఇరుక్కున్న నిరుపేదలకు, అమాయకులకు అండగా నిలిచి షాహిద్ చేసిన న్యాయపోరాటం సినిమా ప్రధాన కథాంశంగా సాగుతుంది. సమాజంలో చట్టపరమైన అన్యాయాలను ఎత్తిచూపుతూ సాగిన ఈ కథ ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది. సమాజం కోసం పోరాడుతూ 2010లో షాహిద్ అజ్మీ దారుణ హత్యకు గురయ్యారు. ఆయన జీవితంలోని కీలక ఘట్టాలను దర్శకుడు హన్సల్ మెహతా ఎంతో సహజంగా, హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించారు. ఈ చిత్రంలో తన అద్భుతమైన నటనతో రాజ్‌కుమార్ రావు ప్రాణం పోశారు. సినిమా విడుదలైన సమయంలోనే విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకోవడంతో పాటు పలు పురస్కారాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా ఈ చిత్రానికి గాను ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు దక్కాయి. దర్శకుడు హన్సల్ మెహతా 'ఉత్తమ దర్శకుడిగా', హీరో రాజ్‌కుమార్ రావు 'ఉత్తమ నటుడిగా' జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత ఓటీటీ బాట పట్టిన ఈ క్లాసిక్ చిత్రాన్ని ఇంటెన్స్ డ్రామాలు ఇష్టపడే ప్రేక్షకులు తప్పకుండా చూడాలని సినీ విశ్లేషకులు సూచిస్తున్నారు.













## ఈ వారం థియేటర్లలో సినిమాల జాతర.. ఏకంగా 10 చిత్రాలు విడుదల

సాధారణంగా ప్రతి వారం రెండు, మూడు సినిమాలు థియేటర్లలోకి రావడం సహజం. కొన్ని వారాల్లో నాలుగైదు చిత్రాలు విడుదలైనా అది పెద్ద విషయంగా అనిపించదు. కానీ ఈసారి మాత్రం పరిస్థితి కాస్త భిన్నంగా ఉంది. అక్టోబర్ 1, 2 తేదీల్లో కలిపి దాదాపు పది సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అయితే ఇన్ని చిత్రాలు విడుదలవుతున్నప్పటికీ.. వాటిలో చాలా సినిమాల గురించి ప్రేక్షకులకు పెద్దగా తెలియకపోవడం గమనార్హం. ప్రమోషన్ల విషయంలోనూ పలువురు హీరోలు, చిత్రబృందాలు వెనుకబడినట్టే కనిపిస్తున్నాయి.

**అక్టోబర్ 1న 'సంచారి'**

మలయాళ స్టార్ నివిన్ పౌలి, తమిళ నటుడు సూరి కలిసి నటించిన చిత్రం 'సంచారి'. మలయాళంలో రూపొందిన ఈ సినిమాను తెలుగులో డబ్బింగ్ చేసి అక్టోబర్ 1న విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు మాత్రం ఇప్పటివరకు పెద్దగా ప్రమోషన్స్ కనిపించలేదు.

**'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్'కు ప్రచారం కరువు**

ఆది సాయికుమార్ ఇటీవల 'శంబాలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకుని ఫామ్‌లోకి వచ్చారు. ఆయన హీరోగా నటించిన 'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్' అక్టోబర్ 2న విడుదల కానుంది. అయితే సినిమా రిలీజ్‌కు సమయం దగ్గరపడుతున్నా.. పెద్దగా ప్రచారం జరగడం లేదు. దీంతో ఈ సినిమా విడుదలవుతున్న విషయం చాలామంది ప్రేక్షకులకు తెలియని పరిస్థితి నెలకొంది.

**సందీప్ కిషన్ 'సిగ్మా'పై కొంత ఆసక్తి**

సందీప్ కిషన్ హీరోగా నటించిన 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కుమారుడు దర్శకత్వం వహించిన చిత్రంగా ఈ సినిమాపై కొంత ఆసక్తి ఏర్పడింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఒకేసారి విడుదల చేస్తున్నారు. మిగతా చిత్రాలతో పోలిస్తే ఈ సినిమాకు కొంత బజ్ కనిపిస్తోంది.

**ఎన్టీఆర్ రాకతో 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'కు హైప్**

ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' కూడా అక్టోబర్ 2న విడుదల కానుంది. ఈ చిత్రానికి రాజమౌళి తనయుడు ఎస్.ఎస్. కార్తికేయ నిర్మాతగా వ్యవహరించారు. విడుదలకు ముందు ఈ సినిమాపై పెద్దగా చర్చ లేకపోయినా.. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు జూనియర్ ఎన్టీఆర్ హాజరు కావడంతో ఒక్కసారిగా సినిమాపై ఆసక్తి పెరిగింది.

**'తత్త్వం'తో దినేష్ తేజ్**

దినేష్ తేజ్, దశ్విక జంటగా నటించిన థ్రిల్లర్ చిత్రం 'తత్త్వం' కూడా అక్టోబర్ 2న విడుదలవుతోంది. సినిమాపై ఇప్పటివరకు భారీ అంచనాలు లేకపోయినా.. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మాత్రం మంచి స్పందన వచ్చింది. థ్రిల్లర్ కథాంశంతో వస్తున్న ఈ చిత్రం థియేటర్లలో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

**'తెల్లకాగితం'కు వివాదమే ప్రచారంగా మారిందా?**

'కోర్ట్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న హర్ష్ రోషన్, కొత్త నటి నక్షత్ర జంటగా నటించిన చిత్రం 'తెల్లకాగితం'. ఇంటర్ విద్యార్థుల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా కూడా అక్టోబర్ 2నే విడుదల కానుంది. సినిమాలోని పాటలకు కొంత స్పందన వచ్చినప్పటికీ.. సినిమాకు ఆశించిన స్థాయిలో బజ్ రాలేదు. ఈ క్రమంలో చిత్రానికి సంబంధించిన ఓ రొమాంటిక్ సన్నివేశం బయటకు రావడం చర్చకు దారితీసింది.

**కీర్తి సురేష్ 'డోరతీ'**

కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'డోరతీ' కూడా ఈ వారం తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎల్‌జీబీటీక్యూ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమా తమిళనాడులో విడుదల సమయంలో వివాదాలను ఎదుర్కొంది. ఇప్పుడు తెలుగులో విడుదలవుతున్నప్పటికీ.. ఇక్కడ పెద్దగా ప్రమోషన్స్ లేకపోవడం సినిమాపై ఆసక్తిని పరిమితం చేస్తోంది.

**'అనకాపల్లి' మరోసారి రిలీజ్**

సంధ్య, విక్రమ్ సహిదేవ్ జంటగా నటించిన 'అనకాపల్లి' సినిమా కూడా అక్టోబర్ 2న విడుదల కానుంది. త్రినాథ్ రావు నక్కిన నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా గతంలో విడుదల కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కేవలం అనకాపల్లిలో మాత్రమే ప్రదర్శించి, ఇతర ప్రాంతాల్లో విడుదలను నిలిపివేశారు. ఇప్పుడు మరోసారి థియేటర్లలోకి తీసుకొస్తున్నారు.

**కన్నడ హిట్ 'ప్రేమనే ఊరిలో'**

కన్నడలో విజయం సాధించిన 'ప్రేమనే ఊరిలో' సినిమాను కూడా తెలుగులోకి తీసుకొచ్చి అక్టోబర్ 2న విడుదల చేస్తున్నారు. అయితే కన్నడలో సక్సెస్ అయినప్పటికీ.. తెలుగు వెర్షన్‌కు మాత్రం ఇప్పటివరకు పెద్దగా ప్రచారం దక్కలేదు.

**తెలుగు డబ్బింగ్ లేకపోయినా 'దృశ్యం: ది కన్ఫ్యూజన్'**

అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన హిందీ చిత్రం 'దృశ్యం: ది కన్ఫ్యూజన్' కూడా అక్టోబర్ 2న విడుదల కానుంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ లేకపోయినా తెలుగు రాష్ట్రాల్లో హిందీ వెర్షన్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు ఇతర చిత్రాలతో పోలిస్తే ఇప్పటికే ఉన్న ఫ్రాంచైజీ కారణంగా ప్రేక్షకుల్లో కొంత పరిచయం ఉంది.

**ఇన్ని సినిమాల్లో ఎన్ని నిలుస్తాయో?**

మొత్తంగా అక్టోబర్ 1, 2 తేదీల్లో దాదాపు పది సినిమాలు థియేటర్లలోకి వస్తున్నాయి. పెద్ద హీరోల సినిమాలు లేని ఈ వారంలో.. కొన్ని చిత్రాలకు మాత్రమే చెప్పుకోదగ్గ బజ్ కనిపిస్తోంది. మరికొన్ని సినిమాలు కనీస ప్రచారం లేకుండానే ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అయితే సినిమా బాగుంటే ప్రచారంతో సంబంధం లేకుండా ప్రేక్షకులు ఆదరించే అవకాశమూ ఉంటుంది. అందుకే ఈ పది చిత్రాల్లో ఏ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com